జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

NIZAMABAD EDITION

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంచార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు

9440231967

నిజామాబాద్ శనివారం 12 సెప్టెంబర్ 2026 సంపుటి : 16 సంచిక : 226 పేజీలు : 8 వెల : 1/- RNI No. TELTEL/2010/35558

శ్రీ పరాభవ నామ సంవత్సరం ఆషాఢ మాసం గ్రీష్మ ఋతువు దక్షిణాయణం సూర్యోదయం: 5.42 । సూర్యాస్తమయం: 6.22 చంద్రోదయం: 4.57 । చంద్రాస్తమయం: 5.20 తిథి: బహుళ చతుర్దశి రా. 1.37 వరకు, తదుపరి అమావాస్య నక్షత్రం: పుష్యమి సా. 10.23 వరకు, తదుపరి ఆశ్లేష యోగం: సిద్ధి రా. 8.18 వరకు, తదుపరి వ్యతీపాత కరణం: భద్ర మ. 2.45 వరకు, తదుపరి శకుని రా. 1.37 వరకు, తదుపరి

Published from : NIZAMABAD, WARANGAL, RANGAREDDY, KAMMAM, NALAGONDA http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com




# చిరుత పులి సంచారం



## భయాందోళనలో గ్రామస్తులు

## అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన

డిచ్‌పల్లి, సెప్టెంబర్ 11: డిచ్‌పల్లి మండలం దూస్ గ్రామంలో చిరుత పులి సంచారం కలకలం రేపింది. గ్రామ పరిసర ప్రాంతాల్లో చిరుత కనిపించినట్లు సమాచారం రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. చిరుత సంచారంతో గ్రామస్తులు, రైతులు అప్రమత్తమయ్యారు. ముఖ్యంగా వ్యవసాయ పొలాల వైపు వెళ్లే సమయంలో జాగ్రత్తగా ఉండాలని గ్రామస్తులు సూచిస్తున్నారు. రాత్రి వేళల్లో ఒంటరిగా బయటకు వెళ్లవద్దని, పిల్లలు, పశువులను జాగ్రత్తగా చూసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. చిరుత సంచారంపై అటవీశాఖ అధికారులకు సమాచారం అందడంతో వారు పరిస్థితిని పరిశీలిస్తున్నట్లు తెలిసింది. చిరుత కదలికలను గుర్తించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు. చిరుతను పట్టుకునే వరకు గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వదంతులను నమ్మకుండా అధికారుల సూచనలు పాటించాలని అధికారులు సూచించారు.





# మన అంగన్‌వాడీ మనందరి బాధ్యత

## -- జిల్లా వ్యాప్తంగా జాతీయ పోషణ మాసం



**కామారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 11(ప్రజా జ్యోతి)**

మన అంగన్‌వాడీ మనందరి బాధ్యత నినాదంతో విస్తృత అవగాహన కార్యక్రమాల పోస్టర్ జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ చేతుల మీదుగా ఆవిష్కరణ సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8వ తేదీ వరకు 9వ జాతీయ పోషణ మాసం కార్యక్రమాలను మహిళాభివృద్ధి,శిశు,

- మిగతా2లో

# నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు

## పోలీస్ కమిషనర్ సాయి చైతన్య

పండుగల వేళ పటిష్ట బందోబస్తు.. 24 గంటలూ వాహనాల తనిఖీలు

డ్రగ్స్, సైబర్ నేరాలపై ప్రత్యేక నిఘా.. అవసరమైతే పీడీ యాక్ట్

రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్ల గుర్తింపు.. ప్రత్యేక డ్రైవ్‌లు

పాత నేరస్థుల కదలికలపై నిరంతర నిఘా.. డయల్ 112పై విస్తృత ప్రచారం




**ప్రజాజ్యోతి, ఆర్మూర్ ప్రతినిధి:**

నేరాల నియంత్రణతో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ఆదేశించారు. శుక్రవారం భీంగల్ సర్కిల్ కార్యాలయంలో ఆర్మూర్ డివిజన్ పరిధిలోని పోలీస్ అధికారులతో పెండింగ్ కేసులు, నేరాల నియంత్రణ, రాబోయే పండుగల బందోబస్తుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక దాడులు నిర్వహించాలని, అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే పీడీ యాక్ట్ నమోదు చేయాలని ఆదేశించారు. సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, ఆన్‌లైన్ మోసాలకు గురైన బాధితులకు తక్షణ సహాయం అందించాలని తెలిపారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు, రెచ్చగొట్టే పోస్టులపై కఠిన చర్యలు తీసుకోవాలని

- మిగతా2లో



# మిల్లర్లపై విజిలెన్స్ దాడులను ఆపాలి

## . . . రైస్ మిల్లర్స్ అసోసియేషన్

**నిజామాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 11 (ప్రజాజ్యోతి)**

రైస్ మిల్లర్లకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామని రైస్ మిల్లు యజమానులు అన్నారు. నిజామాబాద్ నగరంలోని ధర్నా చౌక్ వద్ద నిజామాబాద్ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ , ది నిజామాబాద్ డిస్టిక్ రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చౌక్ లో దర్నా నిర్వహించారు. రైస్ మిల్లర్స్ అందరూ పెద్ద ఎత్తున పాల్గొని నినాదాలు చేసి ధర్నాను విజయవంతం చేశారు. అనంతరం నిజామాబాద్ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మోటూరి దయానంద్ గుప్తా, కార్యదర్శి వడ్డీ మోహన్ రెడ్డి, ది నిజామాబాద్ డిస్టిక్ రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కాపర్తి శ్రావణ్ మీడియాతో మాట్లాడుతూ... రైస్ మిల్లర్ లకు 2016 నుంచి రావాల్సిన మిల్లింగ్ చార్జీల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, అలాగే మిల్లింగ్ చార్జీని రూ.150కి

- మిగతా2లో

# ఇందిరమ్మ ఇండ్ల ఫేజ్-2 అర్హుల మంజూరు ప్రతిపాదనలు

## బుధవారం లోపు సమర్పించాలి.. జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**కామారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి)**

అర్హుల ఎంపికలో సమగ్ర క్షేత్ర పరిశీలన చేపట్టాలి పారదర్శకంగా, పక్షపాతానికి తావులేకుండా లబ్ధిదారుల ఎంపిక జరగాలి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఇందిరమ్మ ఇండ్ల పథకం ఫేజ్-2 కింద అర్హులైన లబ్ధిదారుల మంజూరు ప్రతిపాదనలను బుధవారం లోపు సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఎంపీడీవోలను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో తాడ్వాయి, జుక్కల్, బిచ్కుంద, బాన్సువాడ, పిట్లం, పెద్ద కొడప్గల్, , నిజాంసాగర్ డోంగ్లి మండలాలతో పాటు బిచ్కుంద, బాన్సువాడ మున్సిపాలిటీలకు సంబంధించిన అధికారులతో జిల్లా కలెక్టర్ ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్

- మిగతా2లో



### నిజామాబాద్ రూరల్‌లో వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుపై

# అసెంబ్లీలో ఎమ్మెల్యే ప్రస్తావన

**గుండారం--ఖానాపూర్ ప్రాంతంలో 500 ఎకరాలు గుర్తించాం..**

**అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి**

**సానుకూలంగా స్పందించిన మంత్రి.. అందుకు చర్యలు తీసుకుంటామని అసెంబ్లీ సాక్షిగా వెల్లడి**



**నిజామాబాదు రూరల్ ప్రజా జ్యోతి** శుక్రవారం జరిగిన అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి లేవనెత్తిన వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటు అంశం పై రాష్ట్ర ఐటి మరియు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల మంత్రి శ్రీధర్ బాబు సానుకూలంగా స్పందించారు. జిల్లా వ్యవసాయ ఆధారిత ప్రాంతంగా ఉన్నందున, ఇక్కడ వ్యవసాయ ఉత్పత్తులకు విలువను జోడించే ఆహార శుద్ధి, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను ఏర్పాటు చేయడం ద్వారా రైతులకు అదనపు ఆదాయంతో పాటు యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయంలో అసెంబ్లీలో పేర్కొన్నారు. గతంలో జిల్లాలో చక్కెర పరిశ్రమ కూడా మూతపడిందని, ప్రస్తుతం జిల్లాలో పెద్దగా పరిశ్రమలు లేకపోవడం వల్ల స్థానికంగా ఉపాధి అవకాశాలు పరిమితంగా ఉన్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ఉపాధి అవకాశాల కల్పనలో పరిశ్రమల పాత్ర అత్యంత కీలకమని, వ్యవసాయ రంగానికి అనుసంధానంగా పరిశ్రమలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

**రైజింగ్ తెలంగాణ లక్ష్యాలకు అనుగుణంగా అభివృద్ధి**

2047 నాటికి అభివృద్ధి చెందిన తెలంగాణగా తీర్చిదిద్దే లక్ష్యానికి అనుగుణంగా గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని భూపతి రెడ్డి అన్నారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం (రూరల్ అగ్రికల్చరల్ రీజినల్ ఎకనామీ) పరిధితో పాటు ప్రధానంగా గ్రామీణ, వ్యవసాయ ప్రాంతాలతో కూడి ఉన్నందున ఫుడ్ ప్రాసెసింగ్, అగ్రో బేస్డ్ ఇండస్ట్రీస్ ఏర్పాటుకు అపారమైన అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

**గుండారం--ఖానాపూర్ ప్రాంతంలో 500 ఎకరాల గుర్తింపు**

జిల్లా కేంద్రానికి సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న గుండారం--ఖానాపూర్ ప్రాంతంలో సుమారు 500 ఎకరాల భూమిని పరిశ్రమల ఏర్పాటుకు అనువైన ప్రాంతంగా గుర్తించినట్లు భూపతి రెడ్డి తెలిపారు. ఈ ప్రాంతానికి అనేక అనుకూలతలు ఉన్నాయని ఆయన వివరించారు. రైల్వే డబ్లింగ్ పనులతో పాటు రైల్వే గోదాం కూడా మంజూరు కావడంతో భవిష్యత్తులో రైల్వే రవాణా మరింత సులభతరం కానుందని అన్నారు. రైల్వే, రోడ్డు రవాణా సౌకర్యాలతో పాటు నీటి లభ్యత ఉండటం, జిల్లా కేంద్రానికి సమీపంలోనే ఉండటం వల్ల వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు ఈ ప్రాంతం అత్యంత అనుకూలంగా ఉంటుందని తెలిపారు.

**పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామిక వర్గాల సానుకూలత**

గుండారం--ఖానాపూర్ ప్రాంతంలో వ్యవసాయ ఆధారిత, ఆహార శుద్ధి పరిశ్రమలను ఏర్పాటు చేసే అంశంపై చాంబర్ ఆఫ్ కామర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో పాటు ట్రేడర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కూడా సానుకూలంగా ఉన్నారని ఎమ్మెల్యే తెలిపారు. నిజామాబాద్ జిల్లాలో విస్తారంగా లభించే వరి, పసుపు, ఇతర వ్యవసాయ ఉత్పత్తులను స్థానికంగానే శుద్ధి చేసి విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చే విధంగా పరిశ్రమలను ఏర్పాటు చేస్తే రైతులకు, వ్యాపారులకు, యువతకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. గుండారం--ఖానాపూర్ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అవకాశాలపై జిల్లా కలెక్టర్ ద్వారా ఫిజిబిలిటీ అధ్యయనం నిర్వహించి, సంబంధిత పరిశ్రమల ప్రతినిధుల అభిప్రాయాలను సేకరించి సమగ్ర ప్రతిపాదనను సిద్ధం చేసి.. మంత్రికి సమర్పించినట్లు పేర్కొన్నారు.

**సానుకూలంగా స్పందించిన మంత్రి..అందుకు చర్యలు తీసుకుంటామని హామీ**

వ్యవసాయానికి పరిశ్రమల అనుసంధానం ద్వారా రైతు ఆదాయం పెంచడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంచడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాన్ని వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు కేంద్రంగా అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి ప్రశ్నోత్తరాల సమయంలో లేవనెత్తిన అంశానికి రాష్ట్ర ఐటి మరియు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సానుకూలంగా స్పందించారు.ఈ మేరకు జిల్లాలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని.. గుండారం-ఖానాపూర్ ప్రాంతంలో రైల్వే లైన్, గోదాంతో పాటు ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఫుడ్ ప్రాసెసింగ్, టర్మరిక్ ప్రాసెసింగ్ వెసులుబాటు ఉన్నాయని చెప్పిన ఎమ్మెల్యే భూపతి రెడ్డి వ్యాఖ్యలను పరిగణనలోకి తీసుకుంటామని పేర్కొన్న మంత్రి..వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుతో పాటు, లాజిస్టిక్ పార్క్ ఏర్పాటు దిశగా తప్పకుండా చర్యలు తీసుకుంటామని అసెంబ్లీలో వెల్లడించారు.

### అడవులను కాపాడేందుకు తమ చివరి శ్వాస వరకు

# పోరాడిన అడవి అమరవీరుల త్యాగం.





**ఇందల్వాయి, సెప్టెంబర్ 11,(ప్రజా జ్యోతి ):** జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని, అడవుల పరిరక్షణలో వీరమరణం పొందిన అటవీశాఖ అధికారుల, సిబ్బంది త్యాగాలను స్మరించుకుంటూ ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఫారెస్ట్ రేంజ్ అధికారి రవి మోహన్ భట్, అడవి సంరక్షణలో ప్రాణాలు అర్పించిన అమరవీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అడవులను, వన్యప్రాణులను కాపాడే క్రమంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన అధికారుల సేవలు వెలకట్టలేనివని ఆయన కొనియాడారు.
?అనంతరం నిజామాబాద్ జిల్లా అటవీశాఖ అధికారుల ఆధ్వర్యంలో అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో అటవీశాఖ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని, అటవీ సంపదను పరిరక్షించడమే అమరులకు ఇచ్చే నిజమైన నివాళి అని నినాదాలు చేశారు.
?ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సెక్షన్ అధికారులు, బీట్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎడ్ల పొలాల అమావాస్య సందర్భంగా ఘనంగా అన్నదానం.



**ముప్కాల్, ప్రజాజోతి, సెప్టెంబర్ 11** ముప్కాల్ మండల కేంద్రంలో ఎడ్ల పొలాల అమావాస్య సందర్భంగా గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా అన్నదాన సత్రం నిర్వహించారు. గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కొన్ని సంవత్సరాలుగా ఆనవాయితీగా కొనసాగుతున్న ఈ కార్యక్రమాన్ని గ్రామంలోని అన్ని కులాల ప్రజలు కలిసి ఒక గ్రామ పండుగలా నిర్వహించడం విశేషం. శ్రావణమాసం ప్రారంభమైన నాటి నుంచి నెల రోజుల పాటు పలువురు భక్తులు భక్తిశ్రద్ధలతో ఉపవాసాలు, పూజలు నిర్వహిస్తారు.శ్రావణమాసం ముగింపు సందర్భంగా ఎడ్ల పొలాల అమావాస్య రోజున నిర్వహించే ఈ అన్నదాన కార్యక్రమంలో భోజనం చేసిన అనంతరం తమ శ్రావణమాస ఉపవాసాలు, పూజా కార్యక్రమాలు పూర్తయినట్లుగా భక్తులు భావిస్తారు. దీంతో ప్రతి సంవత్సరం ఈ రోజున నిర్వహించే అన్నదానానికి ప్రత్యేక ప్రాధాన్యత ఏర్పడింది.ఉదయం నుంచే గ్రామస్తులు, భక్తులు అన్నదాన సత్రానికి చేరుకుని భోజనం చేశారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ వృద్ధులు, రైతులు, యువజన సంఘం నాయకులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.గ్రామంలో ఐక్యత, సోదరభావం, సంప్రదాయాలను కాపాడుతూ అన్ని వర్గాల ప్రజలు కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. తరతరాలుగా వస్తున్న గ్రామ ఆచారాలు, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాలనే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం ఈ అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.ఎడ్ల పొలాల అమావాస్య సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమంతో గ్రామంలో ఆధ్యాత్మిక, పండుగ వాతావరణం నెలకొంది.

## గుమ్మిర్యాల్ పాఠశాలలో విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ





**ప్రజాజ్యోతి, ఏర్గట్ల:** ఏర్గట్ల మండలం గుమ్మిర్యాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో విద్యార్థులకు ఏకరూప దుస్తులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దేశబోయిన జమున సంజీవ్ యాదవ్, ఉప సర్పంచ్ జె.డి. కిషోర్, మండల విద్యాధికారి ఆనందరావు పాల్గొని విద్యార్థులకు దుస్తులను అందజేశారు. అదేవిధంగా గుమ్మిర్యాల్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కూడా విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు విద్యతో పాటు అవసరమైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.
కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కుట్టుమిషన్ల దరఖాస్తుల గడువును పొడగించాలి

**బీసీ వెల్ఫేర్ అధికారి సాయికుమార్ కు వినతి**



**నిజామాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 10 (ప్రజాజ్యోతి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన బీసీ మహిళలకు ఉచిత వెయ్యి కుట్టుమిషన్ల పంపిణీ దరఖాస్తులకు గడవు పొడగించాలని బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కొట్టూర్ చంద్రకాంత్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం బీసీ వేల్ఫేర్ అధికారి సాయికుమార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కొట్టూర్ చంద్రకాంత్ మాట్లాడుతూ ఈ నెల 15వ తేదిలోగా ఉచిత కుట్టుమిషన్లకు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచించిందని కానీ 12 రెండవ శనివారం, 13 ఆదివారం, 14 వినాయకచవితి వరుస సెలవులు వస్తున్నయన్నారు. కుల, ఆధాయ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తులు చేసుకున్న వారివి ఎమ్మార్వో కార్యాలయాల్లో పెండింగ్ లో ఉన్నాయని దీంతో దరఖాస్తులు తీవ్ర ఇబ...

## బీజేవైఎం మండల అధ్యక్షుడిగా శీను ఎన్నిక

**నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయను: శీను**



**ఇందల్వాయి ( ప్రజా జ్యోతి ) సెప్టెంబర్11:** ఇందల్వాయి మండల కేంద్రంలోని ఇందల్వాయి గ్రామ ఉపసర్పంచ్ మోత్కూరి శ్రీనివాస్.గౌడ్ (శీను)ను భారతీయ జనతా పార్టీ యువ మోర్చా (బీజేవైఎం) మండల అధ్యక్షుడిగా నియమించారు. నిజామాబాద్ జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు కులాచారి దినేష్ ఆదేశాల మేరకు శీనును బీజేవైఎం మండల అధ్యక్షుడిగా ఎంపిక చేసినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన శీను మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ అభివృద్ధికి, యువతను బీజేవైఎం వైపు తీసుకురావడానికి కృషి చేస్తానని తెలిపారు. బీజేవైఎం మండల అధ్యక్షుడిగా తనను ఎంపిక చేసినందుకు జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మండల అధ్యక్షుడు, సీనియర్ నాయకులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియజేశారు. బీజేపీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు యువత సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని శీను పేర్కొన్నారు. తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోపి, సాయికుమార్, రాజు, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా నాయకులు, రాజన్న, బీజేపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సర్..అభ్యంతరాలు పరిష్కారం



**ధర్పల్లి (ప్రజా జ్యోతి) సెప్టెంబర్ 11** మండలంలోని పదమ్మనపేట్ గ్రామపంచాయతీ పరిధిలో 186 మంది ఓటర్లకు అధికారులు నోటీసులు పంపించగా శుక్రవారం రోజు 104 మంది ఓటర్లు హాజరై తమ అభ్యంతరాలను పరిష్కరించుకోవడం జరిగిందని ఎంపీడీవో మారుతి ఒక ప్రకటనలో తెలిపారు 225 పోలింగ్ స్టేషన్ కు సంబంధించి ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించడం జరిగిందని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ వసంత రమేష్ జూనియర్ అసిస్టెంట్ విజయ్ జిపిఓ సాయిలు జాఫర్ అఫ్రోజ్ గణేష్ జిపిఓ మధు మరియు గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## మిల్లర్లపై విజిలెన్స్ దాడులను ఆపాలి

-మొదటిపేజీ తరువాయి




పెంచాలని కోరారు. సీఎంఆర్ కింద క్వింటాల్కు ఇవ్వాల్సిన ఔటర్న్ 67 కిలోల బియ్యం తో రైసిమిల్లర్ లకు తీవ్ర నష్టం జరుగుతోందని వాపోయారు. గతంలో జరిపిన టెస్ట్ మిల్లింగ్ రిపోర్టులను బహిర్గతం ఎందుకు చేయడం లేదో చెప్పాలన్నారు. తప్పనిసరిగా టెస్ట్ మిల్లింగ్ చేసి ఎంత ఔటర్న్ వస్తుందో అంతే ఇస్తామని స్పష్టం చేశారు. ఔటర్న్ నిష్పత్తిని ఖరీఫ్, రబీ పంటలకు వేర్వేరుగా నిర్ధారించాలని డిమాండ్ చేశారు. విజిలెన్స్, ఎన్ఫోర్స్మెం ట్, టాస్కోఫర్స్ ఆకస్మిక దాడులను వెంటనే నిలిపేవేయాలని, మిల్లర్లతో ప్రభుత్వం చర్చలు జరపాలన్నారు. ఎఫ్సీఐ కఠినమైన నిబంధనలను కొంత మేర సడలించాలని, ఖరీఫ్ ధాన్యాన్ని పూర్తిగా రా రైస్ గా, రబీ ధాన్యాన్ని పూర్తిగా బాయిల్డ్ రైస్ గా మాత్రమే స్వీకరించాలన్నారు. 2022-23 రబీ టెం డర్ ధాన్యం ధరను న్యాయబద్ధంగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. మిల్లర్లను ఇబ్బందులకు గురి చేయొద్దని, సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున రైస్ మిల్లుల యజమానులు సిబ్బంది పాల్గొన్నారు.

# వ్యాసరచన పోటీలో పాల్గొన్న క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు

**'కృతజ్ఞత' అంశంపై తెలుగు, ఆంగ్ల భాషల్లో వ్యాసరచన**



**ప్రజాజ్యోతి, వేల్పూర్:** విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలుగులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో వేల్పూర్ రెవెన్యూ శివారులోని కుండలిని జ్ఞాన యోగి అవధూత శ్రీ శ్రీ శ్రీ గోవింద గిరి స్వామి దివ్య యోగాశ్రమంలో శుక్రవారం ఆర్మూర్ మండలంలోని క్షత్రియ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ విద్యార్థులకు వ్యాసరచన పోటీ నిర్వహించారు. 'కృతజ్ఞత' అనే అంశంపై తెలుగు, ఆంగ్ల భాషల్లో నిర్వహించిన ఈ పోటీలో మొత్తం 178 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బెంగళూరుకు చెందిన ఆధ్యాత్మికవేత్త, ధర్మ ప్రచారకులు శ్రీ రాఘవేంద్ర స్వామి, కమిటీ సభ్యులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు ఉత్సాహంగా వ్యాసరచన పోటీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయులు మందాపురం లింబాద్రి గౌడ్, కొయ్యల రాఘవేందర్, కూశన్నగారి నర్సయ్య, అబ్బగోని జగదీశ్వర్ గౌడ్, నోముల గంగారెడ్డి, సాయిరాం బాలరాజ్, గడ్డం మల్లేష్, కొండ అశోక్ గౌడ్, మహేందర్, కంకణాల రాజేశ్వర్, తీగల రఘు, కమిటీ సభ్యులు, స్వచ్ఛంద సేవకులు, తదితరులు పాల్గొన్నారు.

# సాటాపూర్ పాఠశాలలో విద్యార్థులకు షూ ల పంపిణీ




**ప్రజాజ్యోతి,రెంజల్.** రెంజల్ మండలం సాటాపూర్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో సర్పంచ్ లచ్చావార్ సుహాసినినితిన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు షూ లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు విద్యతో పాటు అవసరమైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆమె తెలిపారు.
కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాంరెడ్డి, వార్డు మెంబెర్స్ దెబ్బడ రాజు, గంగాధర్, అశోక్, సాబీత్,గ్రామస్తులు సాయిలు, జాడి సాయిలు,పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# భారీ గణేష్ విగ్రహాల రాకపై ప్రత్యేక నిఘా

**కమ్మర్‌పల్లి చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేసిన నిజామాబాద్ పోలీస్ కమిషనర్**



**ప్రజాజ్యోతి, కమ్మర్‌పల్లి:** వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో భారీ గణేష్ విగ్రహాల తరలింపుపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా కమ్మర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని హనుమాన్ గుడి వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్‌పోస్ట్‌ను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐపీఎస్ శుక్రవారం తనిఖీ చేశారు.
కోరుట్ల వైపు నుంచి నిజామాబాద్ వైపు తరలిస్తున్న భారీ గణేష్ విగ్రహాలకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు నమోదు చేస్తున్నారు. విగ్రహాల పరిమాణం, తరలింపు మార్గం, నిర్వాహకుల వివరాలతో పాటు వాహనాల రాకపోకలను ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు.
ఈ సందర్భంగా చెక్‌పోస్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందిని పోలీస్ కమిషనర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. భారీ గణేష్ విగ్రహాలను తరలించే సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అలాగే విగ్రహాలను తరలించే వాహనాల్లో భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా, అవసరమైన వాహన పత్రాలు ఉన్నాయా, డ్రైవర్లు నిబంధనలు పాటిస్తున్నారా అనే అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సిబ్బందిని ఆదేశించారు. వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా, సురక్షిత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్ శాఖ అన్ని ముందస్తు చర్యలు చేపడుతోందని కమిషనర్ తెలిపారు. గణేష్ ఉత్సవ నిర్వాహకులు పోలీస్ శాఖకు సహకరించి ట్రాఫిక్, ప్రజా భద్రతకు సంబంధించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు.

# వర్షాకాలంలో వ్యాధుల నివారణకు ఆరోగ్య శిబిరం



**కామారెడ్డి టౌన్ సెప్టెంబర్ 11 ప్రజా జ్యోతి** కామారెడ్డి మండలం లింగాపూర్ గ్రామంలో వర్షాకాలం నేపథ్యంలో వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పుల కారణంగా ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలనే ఉద్దేశంతో లింగాపూర్ కం నరేందర్ రెడ్డి గ్రామంలో ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామ ప్రజల ఆరోగ్య పరిస్థితులను పరిశీలించడంతో పాటు, వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించేందుకు ఈ ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది గ్రామంలోని ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సలహాలు అందించారు. వర్షాకాలంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, జ్వరం, దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులు తదితర లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. అలాగే తాగునీటిని శుభ్రంగా, సురక్షితంగా వినియోగించాలని, ఆహారాన్ని పరిశుభ్రంగా తీసుకోవాలని వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు గ్రామ పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ ఆరోగ్య శిబిరం ద్వారా గ్రామ ప్రజలకు వైద్య సేవలు అందడంతో పాటు వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడం జరిగింది. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఇలాంటి ఆరోగ్య శిబిరాలను నిర్వహించడం అభినందనీయమని గ్రామస్థులు తెలిపారు. ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోని ప్రభుత్వ వైద్య కేంద్రాన్ని సంప్రదించాలని వైద్య సిబ్బంది సూచించారు.

# భీంగల్ పోలీస్ స్టేషన్‌ను పర్యవేక్షించిన పోలీస్ కమిషనర్ సాయి సాయి చైతన్య






**ప్రజాజ్యోతి, భీంగల్:** నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య శుక్రవారం భీంగల్ పోలీస్ స్టేషన్‌ను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని వివిధ విభాగాల పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లోని రిసెప్షన్ కేంద్రం, కంప్యూటర్ సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. 5ఎస్ విధానం అమలు, వాహనాల పార్కింగ్ తదితర అంశాలను పరిశీలించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి సూచనలు చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణించేలా అవగాహన కల్పించాలని తెలిపారు. గంజాయి నిర్మూలనకు పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని, గంజాయికి బానిసైన వారికి కౌన్సెలింగ్ అందించాలని సూచించారు. సైబర్ మోసాల బారిన పడకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని, గేమింగ్ యాప్‌ల ద్వారా జరిగే మోసాలపై ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం పోలీస్ స్టేషన్ సిబ్బందితో మాట్లాడి వారి సాధకబాధకాలను అడిగి తెలుసుకున్నారు.
ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఏసీపీ జె. వెంకటేశ్వర్ రెడ్డి, భీంగల్ సీఐ పొన్నం సత్యనారాయణ గౌడ్, ఎస్ఐ సి.హెచ్. తిరుపతి, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు



-మొదటిపేజీ తరువాయి
సూచించారు. ఆర్మూర్ డివిజన్ పరిధిలో నమోదైన హత్య, హత్యాయత్నం, చోరీలు, మహిళలపై నేరాలు, సైబర్ మోసాలు, డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణా, పేకాట, గుట్కా అక్రమ వ్యాపారం తదితర కేసుల పురోగతిని సమీక్షించారు. పెండింగ్ కేసులను వేగంగా పరిష్కరించి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రౌడీషీటర్లు, పాత నేరస్థులు, బెయిల్‌పై విడుదలైన వ్యక్తుల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని సూచించారు. రాత్రి పహారా వ్యవస్థను బలోపేతం చేసి అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల తనిఖీలను కట్టుదిట్టం చేయాలని తెలిపారు. పేకాట, గుట్కా, ఇసుక, ఇతర అక్రమ వ్యాపారాలపై నిరంతర దాడులు నిర్వహించాలని ఆదేశించారు. మహిళల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ షీ టీమ్స్, ఈగల్ టీమ్స్, చీతా ఫోర్స్‌ను మరింత సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. విద్యాసంస్థలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో నిఘా పెంచాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి పెట్టాలని కమిషనర్ ఆదేశించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను బ్లాక్ స్పాట్లుగా గుర్తించి సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. హైవేలను కలిపే లింకు రోడ్ల వద్ద అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడం, రహదారులకు అడ్డుగా ఉన్న పొదలను తొలగించడం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. రహదారి ఇంజనీరింగ్ లోపాలు ఉంటే సంబంధిత జాతీయ, రాష్ట్ర రహదారుల అధికారులతో సమన్వయం చేసుకుని ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతిరోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించడంతో పాటు ఓవర్ స్పీడ్, త్రిబుల్ రైడింగ్, మైనర్లు వాహనాలు నడపడం వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించి స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు రోడ్డు భద్రతా నిబంధనలపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. రాబోయే పండుగల నేపథ్యంలో బందోబస్తును పటిష్టంగా నిర్వహించాలని, 24 గంటలూ వాహనాల తనిఖీలు చేపట్టాలని తెలిపారు. తనిఖీల సమయంలో సిబ్బంది ఎలాంటి అలసత్వం ప్రదర్శించకూడదని స్పష్టం చేశారు. డయల్ 112 సేవలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. సీసీ కెమెరాల వినియోగాన్ని మరింత విస్తరించి సాంకేతిక పరిజ్ఞానాన్ని నేరాల నియంత్రణలో సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో నిర్లక్ష్యాన్ని సహించబోమని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా ప్రతి పోలీస్ అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్మూర్ ఏసీపీ జె. వెంకటేశ్వర్ రెడ్డి, సీసీఆర్‌బీ ఏసీపీ గురునాయుడు, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ ఆర్. అంజయ్య, సీఐలు, ఎస్‌హెచ్‌ఓలు, ఎస్ఐలు, ఐటీ కోర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎత్తుతాండ చెరువులో వ్యక్తి అదృశ్యం

**గట్టుపై లభించిన బట్టలు, చెప్పులు.. గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు**




**ఇందల్వాయి ( ప్రజా జ్యోతి ) సెప్టెంబర్. 11** ఇందల్వాయి: మండల కేంద్రంలోని దేవి తాండ గ్రామపంచాయతీ పరిధిలోని ఎత్తుతాండ చెరువులో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు అదృశ్యమైన ఘటన స్థానికంగా కలకలం రేపింది. పశువులను మేపేందుకు వెళ్లిన చంద్రు (సుమారు 50 సంవత్సరాలు) చెరువులో గల్లంతైనట్లు స్థానికులు అనుమానిస్తున్నారు. చంద్రు పశువులను మేపేందుకు వెళ్లగా, అనంతరం చెరువు గట్టుపై ఆయనకు సంబంధించిన బట్టలు, చెప్పులు కనిపించడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న స్థానిక సబ్‌ఇన్‌స్పెక్టర్ సుమలత సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం పోలీసులు, స్థానికుల సహకారంతో చెరువులో గాలింపు చర్యలు చేపట్టారు. చంద్రు చెరువులోకి వెళ్లి ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడా? లేక మరేదైనా కారణం ఉందా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తు అనంతరం వెల్లడికానున్నాయి.

# మెట్టు మర్రి తండాలో ఉచిత వైద్య శిబిరం



**సిరికొండ, ప్రజా జ్యోతి** సిరికొండ మండల కేంద్రంలో మెట్టు మర్రి తాండా గ్రామంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు గ్రామంలో వృద్ధులకు మహిళలకు అన్ని రకాల టెస్టులు చేసి మందులు అందజేశారు వర్షాకాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని గ్రామస్తులకు తెలియజేశారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ తిరుపతి నాయక్, ఏఎన్ఎం, ఆశా వర్కర్లరు గ్రామస్తులు పాల్గొన్నారు

# మెట్టు మర్రి తండాలో నూతన స్మార్ట్ రేషన్ కార్డ్ పంపిణీ



సిరికొండ, ప్రజా జ్యోతి సిరికొండ మండలంలోని మెట్టుమర్రి తాండ గ్రామపంచాయతీలో సర్పంచ్ కే దావత్ తిరుపతి నాయక్ ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేశారు సర్పంచ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత నూతన రేషన్ కార్డులు పంపిణీ జరుగుతుందని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోపి నాయక్, గ్రామ పెద్ద మనుషులు పంతులు,శంకర్ సంతోష్, భద్య నాయక్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు

# ఎన్.ఎస్.యు.ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వరద బట్టు వేణు రాజ్



**నిజామాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 11 (ప్రజాజ్యోతి) :** నిజామాబాద్ నగరానికి చెందిన వరదబట్టు వేణు రాజ్ ఎన్.ఎస్.యు.ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియామకమయ్యారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్న వేణు రాజ్ ను రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా వేణురాజ్ మాట్లాడుతూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించిన జాతీయ, రాష్ట్ర కమిటీ నాయకులకు, నా నియామకానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా వేణురాజ్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డ వారికి గుర్తింపు లభిస్తుందనడానికి తానే ఉదాహరణ అని, గిరిరాజ్ కళాశాలలో ఎన్.ఎస్.యు.ఐ నాయకుడిగా మొదలైన ప్రస్థానం జిల్లా అధ్యక్షుడిగా అలాగే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నుండి నేడు రాష్ట్ర ఉపాధ్యక్షుడి స్థాయి వరకు వచ్చానంటే అది కేవలం క్రమశిక్షణ, నిబద్ధత , అంకితభావం కలిగిన కార్యకర్తలను కాంగ్రెస్ పార్టీ గుర్తించడం వల్లే సాధ్యమైందని అన్నారు. ఎన్ఎస్ యు ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమింపబడిన వేణురాజ్ ను పలువురు అభినందించడంతోపాటు ఆయన నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

# గంగారం తండాలో వైభవంగా 'ఫ్రైడే - డ్రైడే' కార్యక్రమం



**ఇందల్వాయి, సెప్టెంబర్ 11,(ప్రజా శంకరావం ):** మండల కేంద్రంలోని తిర్మన్ పల్లి హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో గంగారం తండా గ్రామపంచాయతీ పరిధిలో పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాధులు వ్యాపించకుండా ఉండేందుకు ఇళ్లు వీధులను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు గ్రామస్తులకు సూచించారు. ప్రతీ శుక్రవారం 'డ్రైడే'గా పాటించి, ఇళ్లలోని పాత టైర్లు, కూలర్లు, పగిలిన కుండలు, పూల కుండీలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని ఆశా వర్కర్లు విస్తృతంగా ప్రచారం చేశారు. దోమల ఉత్పత్తిని అరికట్టడం ద్వారా డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి తీవ్రమైన సీజనల్ వ్యాధుల నుండి రక్షణ పొందవచ్చని ఆరోగ్య నిపుణులు వివరించారు. ఈ కార్యక్రమంలో తిర్మన్ పల్లి హెల్త్ సెంటర్ వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎం నిర్మల రాణి. ఆశా వర్కర్లు,పాశం జ్యోతి, గ్రామపంచాయతీ ప్రతినిధులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బోధన్ లైన్స్ జనరల్ హాస్పిటల్‌లో ఫ్రీ క్యాన్సర్ క్యాంప్ నిర్వహించిన లైన్స్ క్లబ్ బసవేశ్వర్..



**ప్రజా జ్యోతి ప్రెస్ రిపోర్టర్ మోహన్ బోధన్ సెప్టెంబర్ 11..** బోధన్ పట్టణంలోని బోధన్ లయన్స్ జనరల్ హాస్పిటల్ లో ఫ్రీ క్యాన్సర్ క్యాంప్ బసవతారకం ఇండో అమెరికన్ ఇన్స్టిట్యూట్ బాలకృష్ణ వారు ఈ యొక్క ఫ్రీ క్యాంప్ క నిర్వహించారు ఈ ఫ్రీ క్యాంపు కి మొత్తం 177 మంది రోగులు వచ్చి వైద్యులను సంప్రదించి చూపించుకోవడం జరిగింది మా వారు 80 మంది ఆడవారు 97 మంది పాప్స మేయర్ 62 ఎక్స్రే 13 అల్ట్రా సౌండ్ 27 మాము 41 సోను ఐదు రిఫరల్ జీరో చూసినట్టు వైద్యులు మానవిత డాక్టర్ జ్యోతి డాక్టర్ ప్రశాంత్ క్యాన్సర్ వ్యాధిలో తో బాధపడుతున్న రోగులకు చూడడం జరిగింది ఇట్టి కార్యక్రమానికి లైన్స్ క్లబ్ అధ్యక్షుడు బసవేశ్వర రావు గారి ఆధ్వర్యంలో మరియు లైన్స్ మెంబర్స్ శ్రీనివాస్ సార్ విజయ్ కుమార్ సార్ ప్రదీప్ గుప్తా వాసు లైన్స్ క్లబ్ మెంబర్స్ ఈ కార్యక్రమంలో పాల్గొనరు శ్రీనివాస్ సార్ మాట్లాడుతూ మనిషి జీవన విధాన సైలని మార్చుకోవాలని తినే తిండిలోని లోపం ఉందని ఆయన స్పష్టంగా తెలియజేశారు ఇప్పుడు తింటున్న ఈ తిండికి ఇటువంటి బలం లేకపోవడం వలన ప్రతి ఒక్కరికి క్యాన్సర్ వ్యాధి గాని ఇంకా ఇతర వ్యాధులు వచ్చే అవకాశాలు ఉంటాయి స్పష్టంగా చెప్పడం జరిగింది

# గ్రామస్తుల గందరగోళం మధ్య.. లక్కీడ్రాలో ఇళ్ల పంపిణీ

ఆర్డీఓ రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో లబ్ధిదారుల ఎంపిక

50 మంది పేర్లలో 36 మందికి ఇళ్ల కేటాయింపు.. భారీ పోలీస్ బందోబస్తు





**బీర్కూర్, ప్రజా జ్యోతి సెప్టెంబర్ 11:** కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజకవర్గం మండల కేంద్రమైన బీర్కూర్‌లో ఐదేళ్ల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన రెండు పడక గదుల ఇళ్ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం గ్రామస్తుల ఆందోళన, గందరగోళం మధ్య కొనసాగింది. భారీ పోలీస్ బందోబస్తు నడుమ లక్కీ డ్రా పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేసి ఇళ్లను కేటాయించారు. స్థానిక రైతు వేదికలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బాన్సువాడ ఆర్డీఓ రవీందర్ రెడ్డి, తహసీల్దార్ సవాయిసింగ్, ఉప తహసీల్దార్ రవికుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో లక్కీ డ్రా నిర్వహించారు. మొత్తం 50 మంది అర్హుల పేర్లను పరిశీలనలోకి తీసుకోగా, అందుబాటులో ఉన్న 36 ఇళ్లకు 36 మంది లబ్ధిదారులను లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేశారు.

**ఆందోళనల మధ్య పంపిణీ**

ఒకవైపు గ్రామ సర్పంచ్ ధర్మతేజ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఇళ్ల కేటాయింపు విధానంపై ఆందోళన వ్యక్తం చేయగా, మరోవైపు అధికారులు లక్కీ డ్రా ప్రక్రియను కొనసాగించారు. అర్హులైన ప్రతి నిరుపేదకు ఇల్లు దక్కేలా చూడాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. లక్కీ డ్రా నిర్వహిస్తున్న సమయంలో అధికారులు మొత్తం ప్రక్రియను వీడియో చిత్రీకరించారు. ఇళ్ల కేటాయింపులో పారదర్శకత ఉండేలా డ్రా ప్రక్రియను అధికారుల సమక్షంలో నిర్వహించారు.

**భారీ పోలీస్ బందోబస్తు**

గ్రామస్తుల ఆందోళన నేపథ్యంలో రైతు వేదిక వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా పోలీసు సిబ్బంది పరిస్థితిని పర్యవేక్షించారు. ఐదేళ్లుగా పంపిణీకి నోచుకోని ఇళ్లకు ఎట్టకేలకు లబ్ధిదారులను ఎంపిక చేసి కేటాయించడంతో ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న కుటుంబాల్లో కొంత ఊరట కనిపించినప్పటికీ, లక్కీ డ్రా విధానంపై గ్రామస్తుల్లో మాత్రం అసంతృప్తి వ్యక్తమైంది.

# భూ యజమాని అనుమతి లేకుండా విద్యుత్ స్తంభాలు



**కామారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి)** భూ యజమాని అనుమతి లేకుండా విద్యుత్ స్తంభాలు కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం లచ్చాపేట గ్రామ శివారులో భూ యజమాని అనుమతి లేకుండా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారని అనిల్‌కుమార్ అనే భూ యజమాని ఆరోపించారు. లచ్చాపేట శివారులో తమకు సుమారు పది ఎకరాల పట్టాభూమి ఉందని తెలిపారు. మహాబల ఇండస్ట్రీస్‌కు విద్యుత్ సరఫరా అందించే క్రమంలో తమ భూమి నుంచి విద్యుత్ లైన్ ఏర్పాటు చేసేందుకు ఏఈతో ఒప్పందం కుదుర్చుకున్నారని, అయితే తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా భూమి మధ్యలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. తమ భూమికి పక్కనే అటవీశాఖకు చెందిన స్థలం ఉన్నప్పటికీ, అక్కడ స్తంభాలు ఏర్పాటు చేయకుండా తమ పట్టాభూమి మధ్యలో ఏర్పాటు చేయడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోయారు. ఈ విషయంపై మాచారెడ్డి విద్యుత్ శాఖ ఏఈ తిరుపతిరెడ్డిని వివరణ కోరగా,తమతో దురుసుగా మాట్లాడారని ఆరోపించారు. ఈ సమస్యపై విద్యుత్ శాఖ డీఈ, ఎస్ఈలకు విన్నవించినప్పటికీ స్పందన లేకపోవడంతో ప్రజావాణిలోనూ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆయిల్‌పామ్ సాగు చేసుకోవడానికి విద్యుత్ స్తంభాలు అడ్డంకిగా మారుతున్నాయని, అధికారులు వెంటనే స్పందించి స్తంభాలను వేరే ప్రాంతానికి మార్చి సమస్యను పరిష్కరించాలని అనిల్‌కుమార్ మీడియా ద్వారా కోరారు.

# అక్రమ అరెస్టులు నిలిపివేయాలి

ఉద్యోగులపై పోలీసుల నిర్బంధాన్ని ఆపాలి.. బీర్కూర్ బీఆర్ఎస్ నాయకుల డిమాండ్



**బీర్కూర్, ప్రజాజ్యోతి సెప్టెంబర్ 11:** శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పోలీసులు అరెస్టు చేయడం సరికాదని బీర్కూర్ బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న అధ్యాపకేతర సిబ్బందిని పోలీసులు అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై రాములతో అరెస్టుల అంశంపై చర్చించారు. గత రెండు రోజులుగా అంగన్వాడీ టీచర్లు, వీఆర్ఏలు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను అరెస్టు చేయడం ప్రభుత్వ నిర్బంధ చర్యలకు నిదర్శనమని నాయకులు విమర్శించారు. పోలీసుల అనుమతితో శాంతియుతంగా నిరసన తెలిపిన వారిని అరెస్టు చేయడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం చర్చల ద్వారా పరిష్కరించాలని, అరెస్టులతో ఉద్యమాలను అణచివేయాలనే వైఖరిని విడనాడాలని డిమాండ్ చేశారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఉద్యోగులు శాంతియుతంగా ఆందోళన చేసే హక్కును ప్రభుత్వం గౌరవించాలని అన్నారు. అరెస్టుల ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని, ఇలాంటి ఘటనలు పునరావృతమైతే ఉద్యోగులకు మద్దతుగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ బీర్కూర్ అధ్యక్షులు చిదరి బాలకృష్ణ, గాండ్ల సంతోష్ కుమార్, కుమ్మరి బాలయ్య, కుమ్మరి దత్తు, గొల్ల శివ, రాంసాని భూమయ్య, మేకల రాములు, గొల్ల సాయిలు, మెక్కా రమేష్, దూళిగా ఎల్లప్ప, దేవానంద్, శివ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# అటవీ భూముల రక్షణలో అధికారులదే కీలక బాధ్యత

అక్రమ చెట్ల నరికివేతకు అడ్డుకట్ట ఎక్కడ..?

అటవీ ప్రాంతాలపై నిఘా పెంచాలని ప్రజల డిమాండ్



**నసురుల్లాబాద్, ప్రజాజ్యోతి సెప్టెంబర్ 11:** అటవీ సంపదను కాపాడాల్సిన బాధ్యత అటవీ శాఖ అధికారులపై ఉన్నప్పటికీ, అటవీ ప్రాంతాల్లో అక్రమంగా చెట్ల నరికివేత ఘటనలు వెలుగులోకి రావడం ఆందోళన కలిగిస్తోంది. నసురుల్లాబాద్ మండలం బొమ్మన్ దేవ్‌పల్లి గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో చెట్లు నరికిన ఘటనలో ఓ వ్యక్తిని అటవీ శాఖ అధికారులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేయగా, న్యాయస్థానం 15 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిసింది. అక్రమంగా చెట్లు నరికిన వ్యక్తిపై చర్యలు తీసుకోవడం స్వాగతించదగ్గ విషయమే అయినప్పటికీ, చెట్లు నరికిన తర్వాత నిందితులను పట్టుకోవడం కంటే.. నరికివేత జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడమే అటవీ శాఖకు ప్రధాన బాధ్యత అనే అభిప్రాయం స్థానికుల్లో వ్యక్తమవుతోంది.

**పర్యవేక్షణపై ప్రశ్నలు**

మారుమూల అటవీ ప్రాంతాల్లో నిరంతర గస్తీ, ఆకస్మిక తనిఖీలు, అక్రమ కలప రవాణాపై నిఘా మరింత పెంచాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. అటవీ భూముల్లోకి అక్రమ ప్రవేశం, చెట్ల నరికివేత, కలప తరలింపు, భూముల ఆక్రమణ వంటి చర్యలు జరుగుతున్నాయా అనే విషయాన్ని అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పరిశీలించాల్సిన అవసరం ఉంది.
కేవలం ఘటన జరిగిన తర్వాత కేసులు నమోదు చేయడం, నిందితులను అరెస్టు చేయడంతో సమస్య పూర్తిగా పరిష్కారం కాదని స్థానికులు అంటున్నారు. అటవీ ప్రాంతాల్లో అక్రమ కార్యకలాపాలకు అవకాశం లేకుండా ముందస్తు పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలని కోరుతున్నారు.

**సరిహద్దుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు**

అటవీ భూములు భవిష్యత్ తరాలకు అందాల్సిన విలువైన సహజ సంపద. ఒక్కసారి చెట్లు నరికివేయడం, అటవీ భూములు దెబ్బతినడం జరిగితే వాటిని తిరిగి పునరుద్ధరించడం అంత సులభం కాదు. అందువల్ల అటవీ శాఖ అధికారులు అటవీ సరిహద్దుల పరిరక్షణ, నిరంతర గస్తీ, అక్రమ కలప రవాణా నియంత్రణ, ఆక్రమణల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

**ముందస్తు నిఘా పటిష్టం చేయాలి**

అటవీ సంపదను కాపాడటంలో ప్రజల భాగస్వామ్యం ఎంత అవసరమో, చట్టబద్ధమైన బాధ్యత వహించే అటవీ శాఖ అధికారుల పర్యవేక్షణ కూడా అంతే కీలకం. అక్రమంగా చెట్లు నరికిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, ఇకపై ఒక్క చెట్టు కూడా అక్రమంగా నరికివేయకుండా ముందస్తు నిఘా వ్యవస్థను పటిష్టం చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# అథ్లెటిక్ పోటీలకు మైనార్టీ గురుకుల విద్యార్థి ఎంపిక



**కామారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి)** కామారెడ్డి మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థి ఎన్. అభిలాష్ గౌడ్ జాతీయస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్స్ పోటీలకు ఎంపికైనట్లు మైనార్టీ గురుకుల బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ నాగరాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.హన్మకొండ జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీల్లో పాల్గొని సిల్వర్ మెడల్ (రెండవ స్థానం) సాధించినట్లు తెలిపారు.ఈనెల 16న పాండిచ్చేరిలో జరిగే 37వ సౌత్ జోన్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్స్-2026 కి ఎంపికయ్యాడని ఆ పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాలలో విద్యార్థి అభిలాష్ గౌడ్ ను ఘనంగా సన్మానించి ప్రోత్సహించినట్లు పేర్కొన్నారు .ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగారెడ్డి,భరత్,మనోజ్ కుమార్,నర్సాగౌడ్,ప్రేమ్ కుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# బోధన్ ఆర్‌డీఓ ఎం. విజయ కుమారి అధికారులతో గణేష్ ఉత్సవాల శాంతి కమిటీ సమావేశం..



**ప్రజా జ్యోతి బోధన్ సెప్టెంబర్ 11..** బోధన ఆర్డిఓఎం విజయ కుమారి పలు శాఖల అధికారులతో గణేష్ ఉత్సవాల శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు గణేష్ ఉత్సవాల లో భాగంగా రెవెన్యూ, పోలీస్, విద్యుత్, ఎక్సైజ్, ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, మున్సిపల్ తదితర సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం నిమజ్జన ఘాట్లను పరిశీలించి, అక్కడ చేపట్టిన ఏర్పాట్లను సమీక్షించారు. మున్సిపల్ చైర్మన్ పద్మశారత్ రెడ్డి మున్సిపల్ కమిషనర్ కృష్ణ జాదవ్ ఎమ్మార్వో విటల్ బోధన్ ఎసిపి శ్రీనివాస్ బోధన్ ఎస్ హెచ్ ఓ వెంకట్ నారాయణ పశువాగు దగ్గర ఉన్న ఏరియాను పరిశీలించారు అనంతరం శంకర్ నగర్ లో గల వినాయకుల బావి దగ్గర బావిని పరిశీలించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని అనంతరం బోధన్ గవర్నమెంట్ కాలేజ్ పక్కనే ఉన్న గణేష్ బావిని పరిశీలించి జాలి వేయించాలని ముందు జాగ్రత్తలు తీసుకోవాలని గణేష్ ఉత్సవాల సందర్భంగా ఘాట్ లు ఉన్న ప్రాంతాలు పసుపు వాగు షక్కరనగర్ వినాయకుల బావి జూనియర్ కాలేజ్ మైదానం లో వినాయకుల బావి వీటన్నిటిని అధికారులతో కలిసి బోధన ఆర్డిఓ విజయ కుమారి పరిశీలించారు .

# పిడిఎస్ బియ్యం లారీని పట్టుకున్న బోధన్ టౌన్ ఎస్హెచ్ఓ వెంకటనారాయణ



**ప్రజా జ్యోతి బోధన్ సెప్టెంబర్ 11..** బోధన్ టౌన్ పరిధిలో పోలీస్ సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఒక లారీ ఖా16ఖదీ3690 బియ్యం లోడ్ తో రాగా అట్టి లారీ ఆపి తనిఖీ చేయగా అట్టి లారీ డ్రైవర్ దగ్గర ఆ బియ్యానికి సంబంధించి ఎటువంటి పేపర్స్ చూపలేదు, ఆ లారీ లో 523 బస్తాల బియ్యం కలవు, అట్టి బియ్యం రవాణా కి సంబంధించి ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడం తో అట్టి లారీని అదుపులోనికి తీసుకొని సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించగా, వారు అట్టి బియ్యం ని తనిఖీ చేసి అవి పిడిఎస్ బియ్యం అని నిర్ధారించి ఆక్రమముగా మేడ్చల్ నుండి బోధన్ కు 250 క్వింటాల్ పిడిస్ బియ్యం రవాణా చేస్తున్న లారీ డ్రైవరు పై మరియు సంబందిత వ్యక్తు లపై సివిల్ సప్లయ్ అడికారులు ధరఖాస్తు ఇవ్వగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయనైనది. ఎవరైనా నిషేదిత పీడీఎ స్ బియ్యం ని అక్రమ రవాణా చేసిన కలిగి ఉన్న వారి పై తగు చట్ట ప్రకారం చర్య తీసుకుంటామని హెచ్ ఓ వెంకటనారాయణ తెలిపారు


# విజ్ఞాన్ ప్రెస్ అసోసియేషన్ నూతన కార్యవర్గానికి ఘన సన్మానం.



**ప్రజా జ్యోతి, సెప్టెంబర్ 11** కోటగిరి, పోతంగల్ ఉమ్మడి మండలాల విజ్ఞాన్ ప్రెస్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులందరికీ మాల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు కార్యవర్గ సభ్యులకు పూలమాల,శాలువాలుతొ ఘనంగా సన్మానించి. అభినందనలు తెలిపినారు. ఈ సందర్భంగా మాల సంఘం అధ్యక్షుడు మిర్జాపురం చిన్నసాయన్న మాట్లాడుతూ ప్రజా సమస్యలను సమాజం దృష్టికి తీసుకెళ్లడంలో పాత్రికేయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారిదిగా పనిచేస్తూ నిజాలను నిర్భయంగా వెలుగులోకి తీసుకురావడం అభినందనీయం అన్నారు. అణగారిన వర్గాలు, పేదలు, బలహీన వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అనంతరం విజ్ఞాన్ ప్రెస్ అసోసియేషన్ అధ్యక్షుడు గైని గజానంద్, ప్రధాన కార్యదర్శి మోరే. జీవన్ కుమార్ ఆధ్వర్యంలో మాల సంఘం అధ్యక్షుడు మిర్జాపురం చిన్న సాయన్నను పూల దండ వేసి, శాలువతో ఘనంగా సత్కరించారు. పరస్పరం అభినందనలు తెలుపుకొని శుభాకాంక్షలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు సమీర్, కోశాధికారి గైన శంకర్, ముఖ్య సలహాదారులు నూతంకి శ్రీనివాస్, వడ్డే నర్సింలు, కార్యవర్గ సభ్యులు సింహాద్రి, గొండ్ల రవి, భీంరావు తో పాటు మాల సంఘం సభ్యులు జంగం సాయిలు, పాల గంగారం, ఇందూరు శ్రీనివాస్, గైని చిన్న సాయిలు, గైని శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కామ్రేడ్ బి.ఎన్.రెడ్డి

-- తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు
--జె.జె.సి.పి.బాబూరావు రీసెర్చ్ స్కాలర్





**కామారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 11(ప్రజా జ్యోతి)** నిజాం నిరంకుశత్వానికి, దొరల దాష్టీకాలకు మరియు భూస్వాముల ఆగడాలను వ్యతిరేకంగా భారత కమ్యూనిస్టు పార్టీ నేతృత్వంలో భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం 1946 నుండి 1951 వరకు కొనసాగిన 'తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం' ప్రపంచ చరిత్రలోనే ప్రముఖ స్థానాన్ని సముపార్జించుకుని నిత్యనూతన చైతన్య స్రవంతిగా వెలుగొందుతూనే ఉంది. తెలంగాణ సాయుధ పోరాటంలో 'దున్నేవాడిదే భూమి' అనే నినాదం మార్మోగిపోయింది. 'బాంచెన్ దొరా ... నీ కాళ్లు మొక్కుతా' అన్న పీడిత ప్రజానీకం ఆయుధాలు చేబూని దొరల, భూస్వాముల, పెత్తందారుల అరాచకాలను అంతమొందించారు. ఈ తెలంగాణ సాయుధ పోరాటంలో నాలుగు వేల మంది అమరుల త్యాగాలతో వేలాది గ్రామాలు వెట్టి చాకిరి నుండి విముక్తి పొందడమే కాకుండా పది లక్షల ఎకరాల భూములు పేద ప్రజలకు పంపిణీ చేయబడ్డాయి.

తెలంగాణ సాయుధ పోరాట నాయకులలో ఒకరుగా నిలిచి ఉద్యమించిన కామ్రేడ్ భీంరెడ్డి నర్సింహారెడ్డి 'బి.ఎన్.రెడ్డి'గా ప్రాచుర్యం పొందారు. 'దున్నేవాడిదే భూమి' అంటూ ఆయన నినదించి వందలాది ఎకరాల స్వంత భూమిని పేద ప్రజలకు పంపిణీ చేసి ఆదర్శంగా నిలిచారు. ఆయన అనునిత్యం అనేక ప్రజా పోరాటాల్లో నడుం బిగించి పేదల అభ్యున్నతి కోసం అహర్నిశలు ఉద్యమించారు.బి.ఎన్.రెడ్డి ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ( ప్రస్తుత సూర్యాపేట జిల్లా ) తుంగతుర్తి మండలం కర్విరాల కొత్తగూడెంలో వందలాది ఎకరాలు కలిగిన భూస్వామ్య కుటుంబంలో 1922 మార్చి 15 నాడు భీంరెడ్డి రాంరెడ్డి, చొక్కమ్మ దంపతులకు జన్మించారు. ఆయన భూస్వామ్య కుటుంబంలో జన్మించిననూ ఆలోచనలు, ఆశయాలు మాత్రం సమ సమాజం వైపుగా పయనింపజేశాయి. క్రమంగా ఆయన తెలంగాణ సాయుధ పోరుబాట దిశగా అడుగులు వేసి తొలి గెరిల్లా గాను ముందుకు సాగారు.తెలంగాణ సాయుధ పోరాట సమన్వయ కమిటీకి బి.ఎన్.రెడ్డి కార్యదర్శిగా పనిచేశారు. కరీంనగర్, ఖమ్మం, పాత సూర్యాపేట, దేవరుప్పల, ఆలేరు ప్రాంతాలలో నిజాం సైన్యాన్ని ధిక్కరించి రైతాంగాన్ని సాయుధ పోరాటం దిశగా ఉద్యక్తులుగా చేసి ముందుకు పయనింపజేయడంలో ఆయన ఉద్యమించారు. సాయుధ పోరాటంలో భాగంగా అంతిమంగా గెరిల్లా దళాలను ఏర్పరచడంలోనూ, వారికి శిక్షణ ఇవ్వడంలోనూ, వ్యూహాత్మకంగా శత్రువులను దెబ్బతీసి వారి నుండి ఆయుధాలు పోగు చేసుకోవడంలోనూ మరియు వ్యూహా - ప్రతివ్యూహాలతో శత్రువులను అంతమొందించడంలోనూ బి.యన్.రెడ్డి 'అందెవేసిన చేయి'గా నిలిచారు. స్థానిక భూస్వామ్యుల, జమీందారుల నిరంకుశత్వానికి, వెట్టిచాకిరి విధానానికి వ్యతిరేకంగా మరియు రజాకారుల అరాచకాలకు, ఆకృత్యాలకు వ్యతిరేకంగా ప్రారంభమైన తెలంగాణ సాయుధ పోరాటంలో 'తెలంగాణ ఉద్యమానికి సాయుధ సేనాని'గా నిలిచి ఉద్యమ చివరి దశ వరకు ఆయన వీరోచిత పోరాటం సాగించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో బి.ఎన్.రెడ్డి 'తెలంగాణ చేగువేరా' గానూ వేనోళ్ళ కొనియాడబడ్డారు.

తెలంగాణ సాయుధ పోరాటం ముగిసిన తర్వాత 1957 లో బి.ఎన్.రెడ్డి తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుండి శాసన సభ్యునిగా గెలుపొందారు. భారత కమ్యూనిస్టు పార్టీ చీలిన తర్వాత ఆయన భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్ ) లో చేరారు. 1967 లో సూర్యాపేట నియోజకవర్గం నుండి శాసన సభ్యునిగా గెలుపొందారు. 1971 లో జరిగిన లోక్ సభ ఎన్నికల్లో బి.ఎన్.రెడ్డి సి.పి.ఎం పార్టీ నుంచి మొదటిసారి పోటీ చేసి పార్లమెంట్ సభ్యుడుగా విజయం సాధించారు. మొత్తంగా ఆయన రెండుసార్లు శాసన సభ్యుడు గాను మరియు మూడు సార్లు పార్లమెంట్ సభ్యుడు గాను గెలుపొంది సరికొత్త చరిత్రని సృష్టించారు. బి.ఎన్.రెడ్డి తన 'పాతిక సంవత్సరాల ప్రజాసేవలో మచ్చలేని కమ్యూనిస్టు ప్రజాప్రతినిధి'గా పేరు ప్రఖ్యాతులు పొంది ప్రజాప్రతినిధులకు ఆదర్శంగా నిలిచారు. ఈ తరం రాజకీయ నేతలు మరియు ప్రజాప్రతినిధులు అలాంటి నేతల జీవితాల నుంచి ఆదర్శాలు స్వీకరించి పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బి.ఎన్.రెడ్డి 1997 లో సి.పి.ఎం పార్టీని విడనాడి సి.పి.ఎం ( బి.ఎన్) స్థాపించారు. అనంతరం 2000 లో మద్దికాయల ఓంకార్ స్థాపించిన ఎం.సి.పి.ఐ పార్టీలో ఆయన తన పార్టీని విలీనం చేశారు. ఆయన ఏ కమ్యూనిస్ట్ పార్టీలో కొనసాగిననూ అంతిమంగా ప్రజా సమస్యల విముక్తి కోసం అవిశ్రాంతంగా ఉద్యమించారు.

బి.ఎన్.రెడ్డి చాలా సాదాసీదా నిరాడంబర జీవితాన్ని గడిపారు. ఆయన తనకోసం ప్రత్యేకంగా సంపాదించుకున్నది ఏమి లేదు. భూస్వామ్య కుటుంబంలో జన్మించిన బి.ఎన్.రెడ్డి అదే భూస్వామ్య వ్యవస్థపై తిరుగుబాటు చేసి లక్షలాది ఎకరాల భూమిని భూస్వాముల బారి నుండి విముక్తి చేసి పేదలకు పంచడంలో అనేక పోరాటాలు నిర్వహించారు. ఆ రకంగా ఆయన ఎల్లప్పుడూ పేదల పక్షాన నిలిచి అణచివేత మరియు దోపిడి నుండి అణగారిన వర్గాల విముక్తి కోసం అవిశ్రాంతంగా పోరాడారు. 'కమ్యూనిస్టులను ఐక్యంగా చూడాలి' అని, 'ఆకలిదప్పులు లేని అసమానతలు లేని సమసమాజం ఆవిష్కరించబడాలి' అని ఆయన పరితపించారు. ఏడు దశాబ్దాలకు పైగా ప్రజా పోరాట ఉద్యమాల్లో జననేతగా వెలుగొందిన బి.ఎన్.రెడ్డి 2008 మే 9 నాడు మరణించారు. అంతిమంగా ఆయన తెలంగాణ సాయుధ పోరాట చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని పదిలపరచుకోవడమే కాకుండా భారత కమ్యూనిస్ట్ ఉద్యమ చరిత్రలో 'ఆదర్శ కమ్యూనిస్టు' గానూ వేనోళ్ళ కొనియాడబడుతున్నారు.

# సెంట్రలైజ్డ్ కిచెన్ విధానం రద్దు చేయాలని



**లింగంపేట్, సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి)** తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ కామారెడ్డి జిల్లా సమితి ఎ.ఐ.టి.యుసి అనుబంధము ప్రతినిధులు అదేవిధంగా ఆ సంఘ సభ్యులు శుక్రవారం డి.ఈ.డి కి వినతి పత్రాన్ని అందజేయడం జరిగింది. సందర్భంసెంట్రలైజ్డ్ కిచెన్ విధానం రద్దు చేయాలని 2023-24 సంబంధించిన అల్పాహారం పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఈనెల 16 న దీక్ష, ఏమనగా సెంట్రలైజ్డ్ కిచెన్ విధానం రద్దు చేయాలని, అలాగే 2023, 2024 సంవత్సరాలకు సంబంధించిన 9 నెలల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేసి, ఇప్పుడు ప్రారంభించే అల్పాహార పథకాన్ని వంట కార్మికులతోనే నిర్వహించాలని, అల్పాహారానికి సంబంధించి విధివిధానాలు ప్రకటించాలని, గ్యాస్ తో సహా వంట పథకానికి సరుకులు మొత్తం ప్రభుత్వమే సరఫరా చేయాలని16 న రాష్ట్ర వ్యాప్తంగా దీక్ష నిర్వహిస్తున్నాము.అధికారులు ఈ సమస్యల పై దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

**ప్రధాన డిమాండ్స్...!**

జిల్లాల వ్యాప్తంగా పెండింగ్లో ఉన్న జూన్, జూలై, ఆగష్టు పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి.ఈ విద్యా సంవత్సరం విద్యార్థులకు అందించే అల్పాహారం మధ్యాహ్న భోజన కార్మికులకే అప్పగించాలి.సెంట్రలైజ్డ్ కిచెన్ విధానం పేరుతో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేట్ సంస్థలకు అప్పగించరాదు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత వంట కార్మికులకు రూ.10 వేలు ఇస్తామన్న హామీని వెంటనే అమలు చేయాలి.కోడి గుడ్లను, గ్యాస్, నిత్యావసర వస్తువులను ప్రభుత్వమే సరఫరా చేయాలి.వంట కార్మికులకు ప్రభుత్వ గుర్తింపు కార్డులు ఇవ్వాలి.గతంలో అల్పాహారం చేసిన బిల్లులు, పారితోషిక బకాయిలను వెంటనే చెల్లించాలి.వంట కార్మికులకు ప్రమాద బీమా పథకం అమలు చేయాలి.వంట కార్మికులను రాజకీయ మరే ఇతర కారణాలతో తొలగించరాదు.ప్రతి విద్యార్థికి మెస్ చార్జీ రూ. 25/-లు చెల్లించాలి. పై న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఇట్టి ప్రతులను మండల విద్యాశాఖాధికారి కి, ప్రతీ పాఠశాల ప్రధానోపాధ్యాయుల కు అందజేయడం జరిగిందని పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు షూల పంపిణీ

రాష్ట్ర ప్రభుత్వం అందించిన షూలను విద్యార్థులకు అందజేసిన సర్పంచ్ గుర్రాల లక్ష్మి



**కామారెడ్డి, టౌన్ సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి)** కామారెడ్డి మండలం తిమ్మక్‌పల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన ఉచిత షూలను పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు వారి విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గుర్రాల లక్ష్మి తెలిపారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన షూలను పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేశారు. షూలను అందుకున్న విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా విద్యను అభ్యసించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన సౌకర్యాలను అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సర్పంచ్ గుర్రాల లక్ష్మి సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల బృందం, గ్రామ ప్రజాప్రతినిధులు, పాఠశాల సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రభుత్వానికి, కార్యక్రమ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# గాంధారిలో మట్టితో గణనాథుల తయారీ

**విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన**



**గాంధారి, సెప్టెంబర్ 11 (ప్రజాజ్యోతి):** గాంధారి మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు మట్టితో గణేశ ప్రతిమలను తయారు చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమవడంతో పాటు పర్యావరణానికి నష్టం వాటిల్లుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.గాంధారి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రమేష్ మాట్లాడుతూ మొక్కలు నాటి సంరక్షించడంతో పాటు మట్టి వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించి పూజించడం పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందన్నారు. పాఠశాలలో విద్యార్థులు మట్టి వినాయక ప్రతిమలను తయారు చేయడం అభినందనీయమన్నారు.జీవశాస్త్ర ఉపాధ్యాయులు శంకర్‌గౌడ్, శరణ్య ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రదర్శించిన 'వినాయకుడా.. వినాశకుడా.. భక్తి మనదే.. బాధ్యత కూడా మనదే' నాటిక ఆకట్టుకుంది. నాటిక ప్రదర్శించిన విద్యార్థులతో పాటు మట్టి వినాయక ప్రతిమలు తయారు చేసిన విద్యార్థులను అటవీశాఖ అధికారులు, ఉపాధ్యాయులు అభినందించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు

# మట్టి గణపతి విగ్రహాల వినియోగం ప్రోత్సహించాలి



**కామారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 11(ప్రజా జ్యోతి)** మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతి విగ్రహాల వినియోగాన్ని ప్రజలు ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మట్టి గణపతి విగ్రహాలను జిల్లా కలెక్టర్ పంపిణీ చేశారు. అలాగే కాలుష్య నియంత్రణ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మట్టి గణపతి విగ్రహాల వినియోగం ద్వారా పర్యావరణానికి కలిగే నష్టాన్ని తగ్గించవచ్చని తెలిపారు. రసాయనాలతో తయారు చేసిన విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉన్నందున, పర్యావరణహితమైన మట్టి విగ్రహాలను వినియోగించాలని ప్రజలకు సూచించారు. వినాయక చవితి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకుంటూనే పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టర్ కోరారు. మట్టి గణపతి విగ్రహాల వినియోగంపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ విక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్ వై గిరి, బి సి సంక్షేమ అధికారి నర్సయ్య, సహాయ సంక్షేమ అధికారి చక్రధర్, మరియు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల ఫేజ్-2 అర్హుల మంజూరు ప్రతిపాదనలు

-మొదటిపేజీ తరువాయి

మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇండ్ల ఫేజ్-2 కింద అర్హులైన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. అర్హుల ఎంపికలో ఎలాంటి పక్షపాతానికి తావులేకుండా క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన నిర్వహించి, అర్హతలను నిర్ధారించిన అనంతరం మాత్రమే మంజూరు ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. నిర్దేశించిన బుధవారం గడువులోపు లబ్ధిదారుల మంజూరు ప్రతిపాదనలు సమర్పించడంలో ఎలాంటి జాప్యం చేయరాదని స్పష్టం చేశారు. గడువులోపు ప్రతిపాదనలు సమర్పించని సంబంధిత అధికారులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రయోజనం అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

# మట్టి గణపతుల వినియోగం ఎంతో అవసరం





**కామారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి)** కామారెడ్డి జిల్లా జనహిత గణేష్ మండలి ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతుల వినియోగం ఎంతో అవసరం మట్టి గణపతుల ప్రతిమలను పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతుల ప్రతిమలను వినియోగించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. జనహిత గణేష్ మండలి ఆధ్వర్యంలో మట్టి గణేష్ ప్రతిమల వితరన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మట్టి గణపతుల ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. వినాయక చవితి సందర్భంగా పర్యావరణానికి హాని కలిగించే రసాయనిక రంగులతో తయారు చేసిన విగ్రహాలకు బదులుగా మట్టి గణపతులను ప్రతిష్ఠించి పూజించాలని సూచించారు. మట్టి విగ్రహాలను ఉపయోగించడం ద్వారా నీటి కాలుష్యాన్ని నివారించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించినవారవుతారని తెలిపారు. ప్రజల్లో పర్యావరణహిత వినాయక విగ్రహాల వినియోగంపై మరింత అవగాహన కల్పించేందుకు అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజా సంఘాలు సమన్వయంతో కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ విక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్ వై గిరి, శిక్షణ కలెక్టర్ రవితేజ, టిఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు నరాల వెంకట్ రెడ్డి. టిజివో అధ్యక్షులు డాక్టర్ ఆర్ దేవెందర్ ముల్క నాగరాజు బద్దం సాయిరెడ్డి మామిళ్ల చక్రధర్ మరియు కలెక్టరెట్ ఉద్యోగులు జిల్లా అధికారు లు తదితరులు పాల్గొన్నారు

# ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ప్రతిష్టంగా ఏర్పాట్లు చేయాలి



**కామారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి)** నిల్వ కేంద్రాలను ముందస్తుగా గుర్తించి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలి.జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. ఖరీఫ్ 2026--27 సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు, సన్నద్ధతపై జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ శుక్రవారం కలెక్టర్ సీఎస్, డీసీఎస్ఓ, డీఎం సీఎస్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ధాన్యం నిల్వకు అందుబాటులో ఉన్న గోదాములు, ఇతర నిల్వ ప్రదేశాలను రాష్ట్ర గిడ్డంగుల సంస్థ అధికారులు, సంబంధిత తహసీల్దార్లు, డీటీ సీఎస్‌లు సంయుక్తంగా పరిశీలించి గుర్తించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. గుర్తించిన నిల్వ కేంద్రాల వివరాలను సమగ్రంగా నివేదించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు సౌకర్యవంతంగా కొనుగోలు కేంద్రాల నిర్వహణ, ధాన్యం నిల్వకు అవసరమైన ప్రదేశాల గుర్తింపు, రవాణా తదితర అంశాలపై ముందుగానే సమగ్ర చర్యలు చేపట్టాలని సూచించారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తూ, అవసరమైన మౌలిక సదుపాయాలను అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

# ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

ఇస్రోజీవాడి రైతు వేదికలో రైతు గుర్తింపు కార్డుల నమోదు కార్యక్రమం

అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో రైతులు హాజరు కావాలి

-- ఏఈఓ దేవేంద్ర



**కామారెడ్డి, టౌన్ సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి)** రైతులందరూ తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) దేవేంద్ర రైతులకు సూచించారు. అడ్లూరు క్లస్టర్ పరిధిలోని రైతుల కోసం ఫార్మర్ రిజిస్ట్రీ, రైతు గుర్తింపు కార్డుల నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం ఇస్రోజీవాడి రైతు వేదికలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈఓ దేవేంద్ర మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల వివరాలను సమగ్రంగా నమోదు చేసి వారికి అవసరమైన వ్యవసాయ సేవలు, పథకాల ప్రయోజనాలు సక్రమంగా అందించేందుకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపడుతోందన్నారు. అడ్లూరు క్లస్టర్ పరిధిలోని ఇంకా నమోదు చేసుకోని రైతులందరూ తప్పనిసరిగా తమ ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని కోరారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ కోసం రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డుతో అనుసంధానమైన మొబైల్ ఫోన్ నంబర్ తప్పనిసరిగా వెంట తీసుకురావాలని తెలిపారు. సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో రైతు వేదికకు వచ్చి తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. అయితే ఇప్పటికే గతంలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులు ప్రస్తుతం మళ్లీ నమోదు చేయించుకోవాల్సిన అవసరం లేదని ఏఈఓ దేవేంద్ర స్పష్టం చేశారు. ఇంకా నమోదు చేసుకోని రైతులు మాత్రం ఆలస్యం చేయకుండా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. రైతులకు భవిష్యత్తులో ఎరువుల బుకింగ్, వివిధ వ్యవసాయ పథకాల అమలు, ప్రభుత్వ సేవలు సులభంగా అందించేందుకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రతి రైతు తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవడం ద్వారా ప్రభుత్వ పరంగా అందే సేవలు, పథకాల ప్రయోజనాలను పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు.
ఇస్రోజీవాడి రైతు వేదికలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అడ్లూరు క్లస్టర్ పరిధిలోని గ్రామాలు రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. రైతులు పెద్ద సంఖ్యలో హాజరై తమ వివరాలను నమోదు చేసుకున్నారు.

# తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి



**బీర్కూర్, ప్రజాజ్యోతి సెప్టెంబర్ 11:** సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలని కోరుతూ బీర్కూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. నిజాం, రజాకార్ల పాలన నుంచి తెలంగాణ విముక్తి పొందిన చారిత్రక రోజుగా సెప్టెంబర్ 17ను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మల్లెల యోగేశ్వర్, మండల ఉపాధ్యక్షులు చేపూరి హనుమాన్లు, బీజేపీ సీనియర్ నాయకులు సాయిబాబా, నాగేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అమ్మ ఒడి



**డోంగ్లీ సెప్టెంబర్ 11 (ప్రజాజ్యోతి)** కామారెడ్డి జిల్లా మండల కేంద్రంలోని డోంగ్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం అమ్మఒడి కార్యక్రమం నిర్వహించినట్లు మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీలేఖ తెలిపారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ మేనూర్ పరిధిలోని గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. అవసరం మేరకు రక్త పరీక్షలు నిర్వహించామన్నారు. మంచి పౌష్టికాహారం తీసుకోవాలని, ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవం అయ్యేందుకు అవగాహన కల్పించామన్నారు.

# తెలంగాణ విమోచన దినోత్సవం రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి



**కామారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి)** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు తెలంగాణ విమోచన దినోత్సవం అధికారికంగా ప్రభుత్వం నిర్వహించాలని కామారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఏవో కి వినతి పత్రం అందించడం జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం వచ్చాక కూడా నిజాం నిరంకుశ పాలనలో తెలంగాణ మగ్గి పోయిందని మాజీ ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ చేపట్టిన సైనిక చర్య వల్ల 1948 సెప్టెంబర్ 17 న నియంత నిజాం పాలన నుండి తెలంగాణాకి విమోచనం కలిగిందని నాటి నిజాం రజాకర్ల ఆకృత్యాల వల్ల ఎంతో మంది ధన, మాన ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చిందని నాటి గాయపు గుర్తులు నేటి సమాజానికి తెలిసేలా సెప్టెంబర్ 17 న తెలంగాణ విమోచన దినోత్సవం ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలనీ, కానీ ఓటు బ్యాంకు రాజకీయాల కోసం గత బిఆర్ఎస్ ప్రభుత్వం నేటి కాంగ్రెస్ ప్రభుత్వం చరిత్రను ప్రజలకు తెలియకుండా చేస్తున్నాయని అన్నారు.

# పనుల్లో జాప్యం వద్దు

డ్రెయిన్, సోక్‌పిట్ల నిర్మాణం వేగవంతం చేయాలి.. మహిళా సంఘాల భవనాల పనులు పూర్తి చేయాలి

డి ఆర్ డి ఓ దామోదర్ రెడ్డి



**గాంధారి, సెప్టెంబర్ 11 (ప్రజాజ్యోతి)** గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి, డీఆర్‌డీవో దామోదర్‌రెడ్డి సూచించారు. గాంధారి మండల కేంద్రంలో శుక్రవారం మండల స్థాయి అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.వి.బి.జి--రామ్--జి కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో చేపట్టాల్సిన డ్రెయిన్, సోక్‌పిట్ పనులపై సమావేశంలో చర్చించారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి గ్రామాల్లో పారిశుద్ధ్య పరిస్థితులను మెరుగుపర్చాలని దామోదర్‌రెడ్డి సూచించారు. మహిళా సంఘాల భవనాల నిర్మాణ పనులను కూడా వేగవంతం చేయాలని ఆదేశించారు.వివిధ శాఖల అధికారులు తమ పరిధిలో చేపడుతున్న కార్యక్రమాలు, పనుల పురోగతిని వివరించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి పరిష్కరించాలని ప్రత్యేక అధికారి సూచించారు.సమావేశంలో ఎంపీడీవో రాజేశ్వర్, తహసీల్దార్ రేణుక చౌహాన్, మండల స్థాయి అధికారులు, ముధోలి పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# హమారా ప్రసాద్‌పై దేశద్రోహం కేసు నమోదు చేయాలి

అంబేద్కర్‌ను కించపరిచే పుస్తకాన్ని వెంటనే నిషేధించాలి

అంబేద్కర్, ఉపాధ్యాయ, విద్యార్థి, ప్రజా సంఘాల డిమాండ్



**కామారెడ్డి, టౌన్ సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి)** ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌ను కించపరిచే విధంగా పుస్తకం రచించారంటూ హమారా ప్రసాద్‌పై కఠిన చర్యలు తీసుకుని క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అంబేద్కర్, ఉపాధ్యాయ, విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అంబేద్కర్‌ను అవమానించేలా రాసినట్లు ఆరోపిస్తున్న ఆ పుస్తకాన్ని వెంటనే నిషేధించాలని వారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.
కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో అంబేద్కర్, ఉపాధ్యాయ, విద్యార్థి, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘాల నాయకులు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ దేశ ప్రజలందరికీ సమాన హక్కులు కల్పించేందుకు జీవితాంతం పోరాడిన మహనీయుడని పేర్కొన్నారు. అటువంటి మహానుభావుడిని కించపరిచే విధంగా పుస్తకం రాయడం దేశంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసే చర్య అని ఆవేదన వ్యక్తం చేశారు.
అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు, అభ్యంతరకర రాతలు చేయడం ద్వారా సమాజంలో విభేదాలు సృష్టించేందుకు కొందరు కుట్రలు చేస్తున్నారని సంఘాల నాయకులు ఆరోపించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, పుస్తకం రచయితతో పాటు దీని వెనుక ఉన్న వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమాజంలో అశాంతి, వర్గాల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు.
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కల్పించిన రాజ్యాంగ హక్కుల ద్వారా ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు ఈ అంశంపై స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. అంబేద్కర్‌ను కించపరిచే చర్యలపై ఇప్పటివరకు తగిన చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అంశంపై స్పందించి అంబేద్కర్‌ను అవమానించే ప్రయత్నాలకు వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమించాలని నాయకులు పిలుపునిచ్చారు. హమారా ప్రసాద్‌పై తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, అభ్యంతరకరంగా ఉందని ఆరోపిస్తున్న పుస్తకాన్ని నిషేధించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి ప్రజల మనోభావాలను గౌరవిస్తూ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో అంబేద్కర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల బాబు, జిల్లా అధ్యక్షుడు కొత్తల్ల గంగారం, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంగరి వెంకట్, డీఎస్పీ జిల్లా అధ్యక్షుడు అశోక్, హరికృష్ణ, ఐసా జిల్లా కన్వీనర్ జీవీఎం విఠల్, బాంసిప్ రాష్ట్ర అధ్యక్షుడు దుబాసి నరేందర్, మూఢనమ్మకాల నిర్మూలన సంఘం జిల్లా అధ్యక్షుడు గ్యార బాబు, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు సంగయ్య, సాయి గౌతమ్, సురేష్, భూపతి, కొండ సంజీవ్, పెద్దోలు సాయిలు, బట్టు రాములు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష



**కామారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి)** ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల దృష్ట్యాజిల్లాలో సాగవుతున్న వివిధ పంటల పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే జిల్లాలో అమలవుతున్న డిజిటల్ క్రాఫ్ సర్వే గురించి మండలాల వారీగా సమీక్ష నిర్వహించి ఈ డిజిటల్ క్రాప్ అనేది సకాలంలో పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా ఈ డిజిటల్ క్రాఫ్ సర్వే ప్రకారం వివిధ రైతులకు వెళుతున్న సెల్ఫోన్ మెసేజీలు చూసుకుని ఏదైనా పంట నమోదు లో గనుక మార్పులు చేర్పులు ఉంటే 72 గంటల్లోపు వారు సంబంధిత ఏఈఓ ని కలిసి దానిని సరి చేసుకోవాల్సిందిగా ఆదేశించారు. అలాగే జిల్లాలో ఆయిల్ సాగు మీద కూడా సమీక్ష నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి మరియు జిల్లా డివిజన్ స్థాయి అధికారులు మరియు డిసిఎస్ ఏవో పాల్గొనడం జరిగింది.

# మన అంగన్‌వాడీ మనందరి బాధ్యత

-మొదటిపేజీ తరువాయి

దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారిణి ప్రసన్న తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ చేతుల మీదుగా జాతీయ పోషణ మాసం కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. "మన అంగన్‌వాడీ -- మనందరి బాధ్యత" అనే నినాదంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతిరోజూ వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారిణి తెలిపారు. సంబంధిత శాఖల సమన్వయంతో కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోషణ మాసంలో భాగంగా వైవిధ్యమైన పోషకాహారం, అంగన్‌వాడీ కేంద్రాల్లో తాజాగా వండి అందించే వేడి భోజనం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల పోషణ స్థాయిని మెరుగుపరిచే కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అదేవిధంగా పిల్లల సమగ్ర అభివృద్ధికి పోషకాహారంతో పాటు ప్రాథమిక ప్రేరణాత్మక కార్యకలాపాలు, ప్రధానమంత్రి మాతృ వందన యోజనపై అవగాహన, పోషణ మేళాలు, మెనూ బోర్డుల ప్రదర్శన, పోషణ సమావేశాలు, అంగన్‌వాడీ స్థాయి పర్యవేక్షణ కమిటీల సమావేశాలు, గృహ సందర్శనల ద్వారా అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. పోషణ కార్యక్రమాల్లో సమాజ భాగస్వామ్యాన్ని పెంపొందిస్తూ, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు జవాబుదారీతనాన్ని మరింత బలోపేతం చేయనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారిణి ప్రసన్న పేర్కొన్నారు.

# ప్రజాపాలన దినోత్సవ వేడుకలు పకడ్బందీగా ఏర్పాటు చేయాలి

-- ప్రొటోకాల్ ప్రకారం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

-- జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



**కామారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 11(ప్రజా జ్యోతి)** సెప్టెంబర్ 17న నిర్వహించనున్న ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజాపాలన దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై వివిధ శాఖల జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించనున్న ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను సమన్వయంతో, పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమానికి సంబంధించి వేదిక, ప్రొటోకాల్ ప్రకారం సీటింగ్, ఇతర ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమంలో అనుసరించాల్సిన నిబంధనలు, మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలు, అధికారులు, ప్రభుత్వ సిబ్బందికి తాగునీరు, ఇతర మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోరారు. వివిధ శాఖల జిల్లా అధికారులు తమ సిబ్బందితో కలిసి తప్పనిసరిగా కార్యక్రమానికి హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ గౌరవ వందనం, బందోబస్తు తదితర అంశాలపై పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. వేడుకలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా నిర్వహించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, డి ఆర్ ఓ పాండు, డీఆర్‌డీఓ పీడీ దామోదర్ రెడ్డి, జడ్పీ సీఈఓ చందర్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అటవీ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం



**గాంధారి సెప్టెంబర్ 11 (ప్రజాజ్యోతి)** జాతీయ అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని గాంధారి అటవీ రేంజ్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీ అమరవీరుల సేవలను స్మరించుకుంటూ అధికారులు, సిబ్బంది మౌనం పాటించి నివాళులర్పించారు.అనంతరం అటవీ కార్యాలయం నుంచి గాంధారి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రమేష్ మాట్లాడుతూ.. అటవీ సంరక్షణ కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వర్తించిన అటవీ అమరవీరుల త్యాగాలు విలువకట్టలేనివని అన్నారు. వారి సేవలను ఎప్పటికీ మరువలేమని పేర్కొన్నారు. అటవీ సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.ఈ కార్యక్రమంలో సెక్షన్ అధికారులు సలీం, ప్రతిభ, చిరంజీవి, అహ్మద్ అలీతో పాటు అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా కార్యక్రమం

**సుమారు 800 మంది విద్యార్థుల పాల్గొనడంతో విజయవంతం**




**కామారెడ్డి, టౌన్ సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి)** కామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 800 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. విద్యార్థుల భారీ భాగస్వామ్యంతో కళాశాల ప్రాంగణం సందడిగా మారింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ శ్రీమతి జయకుమారి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఇటువంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా తమ ప్రతిభను, వ్యక్తిత్వాన్ని మరింత అభివృద్ధి చేసుకోవచ్చని అన్నారు. విద్యార్థులలో క్రమశిక్షణ, సామాజిక బాధ్యత, నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు కళాశాల యాజమాన్యం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో కళాశాల అధ్యాపక బృందం ప్రత్యేక కృషి చేసింది. విద్యార్థులందరూ క్రమశిక్షణతో, ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమానికి విజయవంతం చేకూర్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు సంతోష్ రెడ్డి, వెంకట్ నాయక్, ఫణికుమార్, వేణు, సుభాష్, ప్రసాద్, సంతోష్, సాయినాథ్, సుజాత, ప్రవీణ్, సరిత, ఆసియా బేగం, యోగిత, నసీమ్, సాయిదా బేగం, రజాక్, చవిత్ర తదితరులు పాల్గొని కార్యక్రమ నిర్వహణలో తమ వంతు సహకారం అందించారు. భారీ సంఖ్యలో విద్యార్థులు పాల్గొనడంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# ఉగ్రవాయి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు షూల పంపిణీ

**విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యను అభ్యసించాలి**

**-- సర్పంచ్ మహేష్ గౌడ్**



**కామారెడ్డి టౌన్ , సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి)** కామారెడ్డి మండలం ఉగ్రవాయి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన షూలను శుక్రవారం పంపిణీ చేశారు. పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మహేష్ గౌడ్ పాల్గొని విద్యార్థులకు షూలను అందజేశారు.

ఈ సందర్భంగా సర్పంచ్ మహేష్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం, విద్యాభివృద్ధికి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు పుస్తకాలు, యూనిఫాం, షూలు తదితరాలను అందించడం ద్వారా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

విద్యార్థులు ప్రతిరోజూ పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరై ఉపాధ్యాయులు బోధించే విషయాలను శ్రద్ధగా నేర్చుకోవాలని సూచించారు. విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు.

ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలతో విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి మరింత పెరుగుతుందని పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను వారు అభినందించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మహేష్ గౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# పంటల్లో క్షేత్రస్థాయి నిర్ధారణ

**మొక్కజొన్న, పత్తి పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు**



**గాంధారి, సెప్టెంబర్ 11(ప్రజాజ్యోతి)** గాంధారి మండలంలోని పెద్దగుజ్జుల్, నేరల్‌తండా, చద్మల్‌తాండ గ్రామాల్లో శుక్రవారం మొక్కజొన్న, పత్తి పంటల్లో క్షేత్రస్థాయి నిర్ధారణ పర్యటన నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారి రాజా లింగం తెలిపారు. ఆయా గ్రామాల్లో పంటల పరిస్థితిని శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ పర్యటనలో డా. డి. భద్రు, ప్రధాన శాస్త్రవేత్త (మొక్కజొన్న, చిరుధాన్యాలు), డా. బి. మల్లయ్య, ప్రధాన శాస్త్రవేత్త (వృక్ష రోగ శాస్త్రం), డా. సి. హెచ్. అనూష, శాస్త్రవేత్త (కీటక శాస్త్రం) పాల్గొన్నారు. మొక్కజొన్న, పత్తి పంటల్లో నెలకొన్న పరిస్థితులను పరిశీలించి, తెగుళ్లు, కీటకాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు తగు సూచనలు చేశారు. పంటల సంరక్షణలో వ్యవసాయ శాఖ సూచనలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు), రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అంతర్‌జిల్లా ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ కాయిల్స్ చోరీ ముఠా అరెస్ట్

**కామారెడ్డి జిల్లాలో 29, మెదక్ జిల్లాలో 23 ట్రాన్స్‌ఫార్మర్లలో చోరీలు**

**52 ట్రాన్స్‌ఫార్మర్ దొంగతనాలు, హత్యాయత్నం కేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్**

**30 కిలోల కాపర్ వైర్, వాహనం, చోరీ పరికరాలు స్వాధీనం**




**కామారెడ్డి, టౌన్ సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి)** కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ కాయిల్స్‌ను లక్ష్యంగా చేసుకుని వరుస చోరీలకు పాల్పడుతున్న అంతర్‌జిల్లా దొంగల ముఠాను కామారెడ్డి జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. గత ఐదు నెలలుగా రెండు జిల్లాల్లో మొత్తం 52 ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ కాయిల్స్ చోరీకి పాల్పడిన ముఠాకు చెందిన ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరో నిందితుడు పరారీలో ఉండగా, అతడి కోసం ప్రత్యేక పోలీసు బృందాలు గాలింపు చర్యలు చేపడుతున్నాయి.

నిందితుల నుంచి చోరీలకు ఉపయోగించిన యమహా ఎఫ్‌జెడ్ వాహనం, 30 కిలోల కాపర్ వైర్, మొబైల్ ఫోన్‌తో పాటు కట్టింగ్ పరికరాలు, పానలు, రాడ్లు తదితర సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును అత్యంత చాకచక్యంగా ఛేదించిన పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ శ్రీ ఎం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ అభినందించారు.

గత ఐదు నెలలుగా ట్రాన్స్‌ఫార్మర్లే లక్ష్యం

అసిస్టెంట్ ఇంజనీర్ జాదవ్ బాలాజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు భిక్నూర్ మండల పరిధిలోని బస్వాపూర్, భిక్నూర్, గుర్జకుంట, రమేశ్వరపల్లి, జంగంపల్లి, ర్యాగట్లపల్లి గ్రామాల శివార్లలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ కాయిల్స్ చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదులు అందాయి. అదేవిధంగా రాజంపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాల శివార్లలో కూడా ఇలాంటి చోరీలు జరిగినట్లు గుర్తించారు.

కామారెడ్డి జిల్లాలో మొత్తం 29 ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ కాయిల్స్ చోరీకి గురైనట్లు కేసులు నమోదయ్యాయి. ఇదే ముఠా మెదక్ జిల్లాలోని 23 ట్రాన్స్‌ఫార్మర్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడినట్లు దర్యాప్తులో తేలింది. దీంతో భిక్నూర్, రాజంపేట పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేసి పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు.

లైన్‌మెన్‌పై హత్యాయత్నం

రామేశ్వరపల్లి గ్రామానికి చెందిన అసిస్టెంట్ లైన్‌మెన్ ప్రభాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సెప్టెంబర్ 9న రామేశ్వరపల్లి గ్రామ శివారులో గుర్తుతెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్‌ను చోరీ చేసేందుకు ప్రయత్నించారు. ఈ సమయంలో వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన లైన్‌మెన్ ప్రభాకర్‌పై నిందితులు హత్యాయత్నానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై భిక్నూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నాలుగు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు

జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ ఆదేశాల మేరకు కామారెడ్డి డీఎస్పీ ఎస్. మధుసూదన్ పర్యవేక్షణలో భిక్నూర్ సీఐ జె. నరేష్, సీసీఎస్ సీఐ బి. సంతోష్ కుమార్, భిక్నూర్ ఎస్ఐ ఎస్. అనిల్, సీసీఎస్ ఎస్ఐ మహేష్ ఆధ్వర్యంలో నాలుగు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు.

సీసీ కెమెరాల ఫుటేజీ, సాంకేతిక ఆధారాలు, ఇతర సమాచారాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన పోలీసులు నిందితుల కదలికలపై నిఘా పెట్టారు. సెప్టెంబర్ 11న భిక్నూర్ మండల పరిధిలో మరోసారి ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ కాయిల్స్ చోరీకి ప్రయత్నిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. పరివార్ హోటల్ సమీపంలో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించారు.

అన్నదమ్ములే.. దొంగల ముఠా!

పోలీసుల విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ ముఠాలోని నలుగురు నిందితులు సొంత అన్నదమ్ములేనని పోలీసులు గుర్తించారు. నలుగురూ కలిసి ఒక ముఠాగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలింది.

పగటి సమయంలో వివిధ ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించి, రాత్రి వేళల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్న ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడేవారని పోలీసులు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ కాయిల్స్, ఇతర విలువైన సామగ్రిని తొలగించి తీసుకెళ్లి విక్రయించేవారని దర్యాప్తులో వెల్లడైంది.

జైలు నుంచి వచ్చినా మారని తీరు

అరెస్టైన నిందితులు గతంలో కూడా పలు దొంగతనం, రాబరీ కేసుల్లో అరెస్టై జైలుకు వెళ్లినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. జైలు నుంచి విడుదలైన తర్వాత కూడా తమ నేరపూరిత కార్యకలాపాలను కొనసాగిస్తూ తిరిగి వరుస దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు.

నిందితుల్లో బల్బీర్ సింగ్ చతుర్ సింగ్ టాక్‌పై తూప్రాన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రాబరీ కేసు ఉండగా, రూప్ సింగ్ చతుర్ సింగ్ టాక్‌పై బాన్సువాడ టౌన్ పోలీస్ స్టేషన్‌లో రాత్రిపూట ఇంటి దొంగతనాలకు సంబంధించిన రెండు కేసులు, మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో రాబరీ కేసు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. లకన్ చతుర్ సింగ్ టాక్‌ను కూడా ఈ కేసులో అరెస్ట్ చేశారు. మరో నిందితుడు ప్రస్తుతం పరారీలో ఉన్నాడు.

52 ట్రాన్స్‌ఫార్మర్ చోరీలు.. ఇతర కేసులూ

ఈ నలుగురు నిందితులు కలిసి కామారెడ్డి జిల్లాలో 29, మెదక్ జిల్లాలో 23 ట్రాన్స్‌ఫార్మర్లలో చోరీలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. మొత్తం 52 ట్రాన్స్‌ఫార్మర్ చోరీలతో పాటు ఒక హత్యాయత్నం, రాత్రిపూట ఇంటి దొంగతనం కేసులో కూడా వీరి ప్రమేయం ఉన్నట్లు దర్యాప్తులో తేలింది.

పరారీలో ఉన్న మరో నిందితుడిని త్వరలోనే పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసు బృందాలు ముమ్మరంగా గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అరెస్టైన ముగ్గురు నిందితులను కోర్టు ముందు హాజరుపరచి రిమాండుకు తరలించనున్నట్లు వెల్లడించారు.

స్వాధీనం చేసుకున్న వస్తువులు

నిందితుల నుంచి పోలీసులు యమహా ఎఫ్‌జెడ్ వాహనం, ఒక మొబైల్ ఫోన్, 9 ఆక్సర్ బ్లేడ్లు, ఒక కటింగ్ ప్లేయర్, ఒక కట్టర్, 9 పానలు, 10 రింగ్ పానలు, మూడు రాడ్లు, 30 కిలోల కాపర్ వైర్‌ను స్వాధీనం చేసుకున్నారు.

పోలీసు బృందానికి ఎస్పీ అభినందనలు

అంతర్‌జిల్లా ట్రాన్స్‌ఫార్మర్ చోరీల కేసును ఛేదించడంలో అత్యంత చాకచక్యంగా వ్యవహరించిన కామారెడ్డి డీఎస్పీ ఎస్. మధుసూదన్, భిక్నూర్ సీఐ జె. నరేష్, సీసీఎస్ సీఐ బి. సంతోష్ కుమార్, భిక్నూర్ ఎస్ఐ ఎస్. అనిల్, సీసీఎస్ ఎస్ఐ మహేష్, భిక్నూర్ ఏఎస్ఐ వెంకట్రావు, ఏఎస్ఐ గంగారెడ్డి, ఐటీ కోర్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌తో పాటు భిక్నూర్, సీసీఎస్ పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు.

సాంకేతిక పరిజ్ఞానం, సీసీ కెమెరాల ఆధారాలు, పక్కా సమాచారంతో వరుసగా జరిగిన 52 ట్రాన్స్‌ఫార్మర్ చోరీల కేసులను ఛేదించడం ద్వారా కామారెడ్డి జిల్లా పోలీసులు తమ ప్రతిభను మరోసారి చాటుకున్నారని ఎస్పీ పేర్కొన్నారు.

# ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం బీడీ కార్మికులకు రూ.4016

**జీవన భృతి వెంటనే అమలు చేయాలి**

**కొత్త పింఛన్లు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని డిమాండ్**

**పాల్వంచ ఎంపీడీవో కార్యాలయం ముందు బీడీ కార్మికుల ధర్నా**

**తెలంగాణ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు కె. చంద్రశేఖర్**




**పాల్వంచ, సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి)** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో బీడీ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు కె. చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీడీ కార్మికులకు నెలకు రూ.4016 జీవన భృతి అందించడంతో పాటు కొత్త పింఛన్లను వెంటనే మంజూరు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ కింద రూ.7500 అందించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. బీడీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పాల్వంచ మండలంలోని ఎంపీడీవో కార్యాలయం ముందు తెలంగాణ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తమ న్యాయమైన డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీవో కార్యాలయానికి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కె. చంద్రశేఖర్ మాట్లాడుతూ బీడీ పరిశ్రమపై ఆధారపడి వేలాది మంది కార్మికులు, ముఖ్యంగా మహిళా కార్మికులు జీవనం సాగిస్తున్నారని తెలిపారు. తక్కువ ఆదాయంతో కుటుంబాలను పోషిస్తూ అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న బీడీ కార్మికులకు ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలే ప్రస్తుతం ఎంతో అవసరమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో బీడీ కార్మికులకు రూ.4016 జీవన భృతి అందిస్తామని హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన అనంతరం ఆ హామీల అమలుపై ప్రభుత్వం వెంటనే దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా అర్హులైన బీడీ కార్మికులకు కొత్త పింఛన్లు మంజూరు చేయాలని, దీర్ఘకాలంగా పనిచేసిన కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్‌గా రూ.7500 అమలు చేయాలని కోరారు. బీడీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం మానవతా దృక్పథంతో పరిశీలించి వెంటనే పరిష్కరించాలని చంద్రశేఖర్ అన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే రాబోయే రోజుల్లో బీడీ కార్మికుల ఆధ్వర్యంలో చేపట్టే ఆందోళనలు, పోరాటాలకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రోల్ల సత్యం, కందారపు రాజనర్సు, సీఐటీయూ జిల్లా నాయకులు రాణి, జ్యోతి, మమత, వినోద, లావణ్య, సునీత, రేఖ, సౌజన్య, లక్ష్మి, కళావతి, వనిత, నరసవ్వ, అంజవ్వ, కవిత, శోభ, రేణుక, రచన, అనిత, మానస, దుర్గవ్వ, స్వరూపజ్యోతి, సౌందర్య, స్వాతి, లలిత, లత, ఎల్లవ్వ, మౌనిక, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

## క్యాసంపల్లి తండాలో ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించిన అధికారులు

**కామారెడ్డి టౌన్ సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి)** కామారెడ్డి మండలం క్యాసంపల్లి తండా గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను అధికారులు శుక్రవారం పరిశీలించారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణ పనులను ప్రారంభించి, ప్రభుత్వం నిర్దేశించిన దశల ప్రకారం పనులను పూర్తి చేసుకోవాలని అధికారులు సూచించారు.

ఈ సందర్భంగా డీఈ సుభాష్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ రాము గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి, ఆయా ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని, పనులను వేగవంతం చేయాలని సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత సమయంలో ఇళ్లను పూర్తి చేసుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. క్యాసంపల్లి తండా గ్రామంలో మొత్తం 39 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటికే 3 ఇళ్ల నిర్మాణ పనులు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. మిగతా ఇళ్ల నిర్మాణ పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. నిర్మాణ పనులు ప్రారంభించని లబ్ధిదారులు వెంటనే పనులు ప్రారంభించాలని, ఇప్పటికే ప్రారంభించిన వారు పనులను వేగవంతం చేసి ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు సొంత ఇంటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని అధికారులు తెలిపారు. లబ్ధిదారులు అధికారుల సూచనలను పాటిస్తూ ఇళ్ల నిర్మాణాన్ని



పూర్తి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఈ సుభాష్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ రాము, గ్రామ సర్పంచ్ భూక్యా శ్రీనివాస్, గ్రామపంచాయతీ కార్యదర్శి నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

# సెపక్‌టక్రా ఎంపికలకు సిద్ధం కావాలి

**సెపక్‌టక్రా జిల్లా స్థాయి ఎంపికలకు సిద్ధం కావాలి**

**16న చుక్కాపూర్‌లో ఉమ్మడి నిజామాబాద్--కామారెడ్డి జిల్లాల ఎంపికలు**

**అండర్-14, అండర్-17 బాలబాలికలకు అవకాశం**

**బోనాఫైడ్, ఆధార్ ప్రతులు తప్పనిసరి**

**కామారెడ్డి, టౌన్ సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి)** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (గా+ఖీ) కామారెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి నిజామాబాద్--కామారెడ్డి జిల్లాల సెపక్‌టక్రా క్రీడా ఎంపికలు ఈ నెల 16వ తేదీన నిర్వహించనున్నట్లు ఎస్ జి ఎఫ్ కార్యదర్శి ఈ. శ్రీధర్ తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, విద్యాసంస్థల్లో చదువుతున్న సెపక్‌టక్రా క్రీడాకారులకు ఈ ఎంపికలు మంచి అవకాశంగా నిలవనున్నాయని పేర్కొన్నారు.

మాచారెడ్డి మండలం లిలిచుక్కాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జడ్పీహెచ్‌ఎస్)లో సెప్టెంబర్ 16వ తేదీన ఎంపిక పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఉదయం 9 గంటలకు తప్పనిసరిగా రిపోర్ట్ చేయాలని నిర్వాహకులు సూచించారు. ఉమ్మడి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల పరిధిలోని అర్హత కలిగిన బాలబాలికలు ఈ ఎంపికల్లో పాల్గొనవచ్చని తెలిపారు.

రెండు విభాగాల్లో ఎంపికలు

సెపక్‌టక్రా ఎంపికలు అండర్-14, అండర్-17 బాలబాలికల విభాగాల్లో నిర్వహించనున్నారు. అండర్-14 విభాగంలో 2013 జనవరి 1వ తేదీ లేదా ఆ తర్వాత జన్మించిన విద్యార్థులు అర్హులుగా ప్రకటించారు. ఈ విభాగంలో 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు.

అదేవిధంగా అండర్-17 విభాగంలో 2010 జనవరి 1వ తేదీ లేదా ఆ తర్వాత జన్మించిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఈ విభాగంలోనూ 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఎంపిక పరీక్షలకు హాజరు కావచ్చని తెలిపారు.

ధ్రువపత్రాలు తప్పనిసరి

ఎంపికల్లో పాల్గొనే విద్యార్థులు అవసరమైన ధ్రువపత్రాలను తప్పనిసరిగా వెంట తీసుకురావాలని ఎస్ జి ఎఫ్ నిర్వాహకులు స్పష్టం చేశారు. ముఖ్యంగా బోనాఫైడ్ సర్టిఫికెట్ తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. విద్యార్థుల వయస్సు నిర్ధారణ కోసం ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతిని కూడా తీసుకురావాలని సూచించారు.

అదేవిధంగా క్రీడాకారులు ఎంపికలకు హాజరయ్యే సమయంలో సరైన స్పోర్ట్స్ దుస్తులు, క్రీడా పాదరక్షలు ధరించి రావాలని తెలిపారు. ఎంపిక ప్రక్రియలో విద్యార్థుల క్రీడా ప్రతిభ, నైపుణ్యాలను పరిశీలించి అర్హులైన క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. క్రీడాకారులకు భోజన సదుపాయం దూర ప్రాంతాల నుంచి ఎంపికలకు వచ్చే క్రీడాకారుల కోసం నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఎంపికలకు హాజరయ్యే విద్యార్థులకు మధ్యాహ్న భోజన సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎంపికల్లో పాల్గొనేలా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

ప్రతిభను చాటుకోవడానికి మంచి అవకాశం

సెపక్‌టక్రా క్రీడలో ఆసక్తి, ప్రతిభ కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్ జి ఎఫ్ నిర్వాహకులు కోరారు. జిల్లా స్థాయి ఎంపికల్లో ప్రతిభ కనబరిచి తదుపరి స్థాయి పోటీలకు ఎంపికయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పీడీలు, వ్యాయామ ఉపాధ్యాయులు తమ పాఠశాలల్లో ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించి ఎంపికలకు పంపించాలని సూచించారు.

విద్యార్థులు నిర్ణీత సమయానికి ముందుగానే ఎంపిక కేంద్రానికి చేరుకుని, అవసరమైన ధ్రువపత్రాలతో హాజరు కావాలని ఎస్ జి ఎఫ్ కార్యదర్శి ఈ. శ్రీధర్ కోరారు. ఎంపికలకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం చుక్కాపూర్ పీడీ నయాబ్ రసూల్ను 81793 20758 నంబర్‌లో, ఎస్ జి ఎఫ్ కార్యదర్శి ఈ. శ్రీధర్ను 94400 04112, 85550 50005 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

# గ్రామ పంచాయతీ బాడీ సమావేశాన్ని బహిష్కరించిన ఉపసర్పంచ్, వార్డు సభ్యులు

**కామారెడ్డి టౌన్ సెప్టెంబర్ 11 ప్రజా జ్యోతి** కామారెడ్డి మండలంలోని చిన్నమల్లారెడ్డి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గ్రామ పంచాయతీ బాడీ సమావేశాన్ని ఉపసర్పంచ్‌తో పాటు పలువురు వార్డు సభ్యులు బహిష్కరించారు. పంచాయతీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి ఇప్పటివరకు గ్రామ పంచాయతీలో జరిగిన ఖర్చుల వివరాలను తమకు అందించాలని పంచాయతీ కార్యదర్శిని కోరినప్పటికీ, వివరాలు పూర్తిస్థాయిలో అందించలేదని వారు ఆరోపించారు. వార్డు సభ్యుల వివరాల ప్రకారం.. గ్రామ పంచాయతీకి సంబంధించిన ఖర్చులు, అభివృద్ధి పనులు, ఇతర ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వివరాలను పారదర్శకంగా పాలకవర్గ సభ్యులందరికీ తెలియజేయాలని గతంలోనే కార్యదర్శిని కోరినట్లు తెలిపారు. సమావేశం సందర్భంగా కూడా ఇదే విషయంపై కార్యదర్శిని ప్రశ్నించగా, వివరాలు ఇస్తానని చెప్పి సమావేశం మధ్యలో బయటకు వెళ్లిపోయారని పేర్కొన్నారు. అలాగే, పాలకవర్గ సభ్యులకు సరైన సమాచారం ఇవ్వకుండా సర్పంచ్ భర్త, పంచాయతీ కార్యదర్శి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని వారు ఆరోపించారు. గ్రామ పంచాయతీకి సంబంధించిన నిర్ణయాలు పాలకవర్గ సభ్యులందరి సమక్షంలో, నిబంధనల ప్రకారం తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమకు సమాచారం లేకుండా సమావేశాలు, కార్యక్రమాలు నిర్వహించడం పట్ల నిరసనగా



గ్రామ పంచాయతీ బాడీ సమావేశాన్ని బహిష్కరించినట్లు ఉపసర్పంచ్ కమ్మరి స్వప్న తెలిపారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ కమ్మరి స్వప్నతో పాటు వార్డు సభ్యులు అన్మాల రామ్‌కుమార్, నర్సింలు, కృష్ణ, ప్రవీణ్, చంద్రకాంత్, స్వామి, రజిత, భార్గవి, బాలమణి తదితరులు తమ అభ్యంతరాలను వ్యక్తం చేశారు. పంచాయతీకి సంబంధించిన ఆదాయ, వ్యయ వివరాలను పాలకవర్గ సభ్యులకు అందుబాటులో ఉంచాలని, భవిష్యత్తులో పంచాయతీ వ్యవహారాలను సభ్యులందరి సమన్వయంతో నిర్వహించాలని వారు కోరారు.

కార్యదర్శి వివరణ: ఈ విషయంపై 'ప్రజా జ్యోతి' వివరణ కోరగా పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ.. సమావేశానికి ఏఈ గారు వచ్చిన నేపథ్యంలో, "20 నిమిషాల్లో మళ్లీ వస్తాను" అని చెప్పి వెళ్లినట్లు తెలిపారు. సమావేశం మధ్యలో తాను వెళ్లిపోవడానికి ఇదే కారణమని ఆయన వివరణ ఇచ్చారు.

గ్రామ పంచాయతీ పాలకవర్గం మధ్య నెలకొన్న ఈ వివాదంపై అధికారులు స్పందించి, పంచాయతీ ఖర్చుల వివరాలు, సమావేశాల నిర్వహణ తదితర అంశాలపై స్పష్టత ఇవ్వాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# అంతర్ జిల్లా ట్రాన్స్‌ఫార్మర్ చోరీ ముఠా అరెస్ట్

**కామారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 11(ప్రజా జ్యోతి)** కాపర్ కాయిల్స్ చోరీ ముఠా అరెస్ట్, రిమాండు కు తరలింపు కామారెడ్డి జిల్లాలో 29, మెదక్ జిల్లాలో 23 ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ కాయిల్స్ చోరీకి పాల్పడిన అంతర్‌జిల్లా ముఠా మొత్తం 52 ట్రాన్స్‌ఫార్మర్ లు దొంగతనాలు, ఒక హత్య యత్నం.రాత్రి పూట ఇంటి దొంగతనం కేసులు గ్యాంగ్ పట్టివేత సీసీ కెమెరాలు, సాంకేతిక ఆధారాలతో నిందితుల గుర్తింపు 30 కిలోల కాపర్ వైర్, చోరీలకు ఉపయోగించిన వాహనం, పరికరాలు స్వాధీనం.పోలీసు బృందాలను అభినందించిన జిల్లా ఎస్పీ యం.రాజేష్ చంద్ర,

ఫిర్యాదు దారుడు అసిస్టెంట్ ఇంజనీర్ జాదవ్ బాలాజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు, గత ఐదు నెలలుగా భిక్నూర్ మండల పరిధిలోని బస్వాపూర్, భిక్నూర్, గుర్జకుంట, రమేశ్వరపల్లి, జంగంపల్లి, ర్యాగట్లపల్లి గ్రామాల శివారులో మరియు రాజంపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాల శివారుల్లో గల మొత్తం 29 ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ కాయిల్స్ చోరీకి గురైనట్లు ఫిర్యాదులు అందాయి. దీంతో భిక్కనూర్, రాజంపేట పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అదేవిధంగా, రామేశ్వరపల్లి గ్రామ అసిస్టెంట్ లైన్‌మెన్ ప్రభాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు, 09.09.2026న రమేశ్వరపల్లి గ్రామ శివారులో గుర్తుతెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్‌ను చోరీ చేసేందుకు ప్రయత్నిస్తుండగా, వారిని అడ్డుకున్న లైన్‌మెన్ ప్రభాకర్‌పై హత్యాయత్నానికి పాల్పడినట్లు ఫిర్యాదుపై భిక్నూర్ పోలీస్ స్టేషన్లలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, ఆదేశాల మేరకు, కామారెడ్డి డీఎస్పీ ఎస్. మధుసూదన్ పర్యవేక్షణలో భిక్నూర్ సీఐ జె. నరేష్, సీసీఎస్ సీఐ సంతోష్ కుమార్, భిక్నూర్ ఎస్ఐ అనిల్, సీసీఎస్ ఎస్ఐ మహేష్ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిపి నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తును వేగవంతం చేశారు.

దర్యాప్తులో భాగంగా సీసీ కెమెరాల ఫుటేజీ, సాంకేతిక ఆధారాలు మరియు ఇతర సమాచారాన్ని విశ్లేషించిన పోలీసులు ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ కాయిల్స్ చోరీలకు పాల్పడుతున్న అనుమానితులను గుర్తించారు. తేదీ:11.09.2026న భిక్నూర్ మండల పరిధిలో మరలా



ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ కాయల్స్ చోరీ చేసేందుకు నిందితుల కదలికలను గమనించి పరివార్ హోటల్ దగ్గర ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని తదుపరి దర్యాప్తు చేపట్టారు.

**కేసు వివరాల్లోకి వెళితే..!**

అన్నదమ్ములు దొంగతనాలే వృత్తిగా

విచారణలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి.నలుగురు నిందితులు సొంత అన్నదమ్ములే కావడం గమనార్హం నలుగురూ కలిసి ఒక ముఠాగా ఏర్పడి, జల్సాలకు మరియు ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడి సులభంగా డబ్బులు సంపాదించాలనే దురుద్దేశంతో దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు.

పగటి వేళల్లో రెక్కీ నిర్వహించి, రాత్రి సమయంలో లక్ష్యంగా చేసుకున్న ప్రాంతాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ పరికరాలను చోరీ చేస్తారు.చోరీ చేసిన కాపర్ తదితర సామగ్రిని విక్రయించి వచ్చిన డబ్బును వారు జల్సాలకు వినియోగిస్తారు.

జైలు నుంచి వచ్చినా మారని పద్ధతి

విచారణలో నిందితులు గతంలో కూడా దొంగతనం కేసుల్లో అరెస్టై జైలుకు వెళ్లినట్లు వెల్లడైంది. జైలు నుంచి విడుదలైన అనంతరం కూడా తమ పద్ధతిని మార్చుకోకుండా తిరిగి దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు.

**నిందితుల వివరాలు...!**

1.బల్జీర్ సింగ్ చతుర్ సింగ్ టాక్, తండ్రి: చతుర్ సింగ్ టాక్, (నార్సింగ్, తూప్రాన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రాబరీ కేసు)

2.రూప్ సింగ్ చతుర్ సింగ్ టాక్, తండ్రి: చతుర్ సింగ్ టాక్,

(బాన్సువాడ టౌన్ పోలీస్ స్టేషన్‌లో రాత్రి పూట ఇంటి దొంగతనం రెండు కేసులు, మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో రాబరీ కేసు )3.లకన్ చతుర్ సింగ్ టాక్, తండ్రి: చతుర్ సింగ్ టాక్,4.పరారీలో మరో నిందితుడు).

పై నలుగురు నిందితులు 52 ట్రాన్స్‌ఫార్మర్ దొంగతనాలు, ఒక హత్య యత్నం. ఒక రాత్రి పూట ఇంటి దొంగతనం నేరాలు ఇప్పటికే చేసి ఉన్నట్లు గుర్తించడం జరిగింది.

పరారీలో ఉన్న నిందితుడిని అతి త్వరలో పట్టుకొనుటకు ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నారు.అరెస్ట్ కాబడిన 3 నిందితులను కోర్టు ముందు హాజరుపర్చబడును.

నిందితుల నుండి స్వాధీనం చేసుకున్న వాహనాలు, వస్తువుల వివరాలు 1.యమహా బైక్ ఎఫ్ జెడ్,2.మొబైలు ఫోన్లు-01, 3.ఆక్సర్ బ్లేడ్ -- 09, 4. కటింగ్ ప్లేయర్-01, 5.కట్టర్-01, 6. పానలు- 09, 7. రింగ్ పానలు -10, 8.రాడ్స్ -- 03, 9. కాపర్ వైర్ -- 30 కిలోలు. అత్యంత చాకచక్యముగా వ్యవహరించి ఈ కేసును ఛేదించిన కామారెడ్డి డీఎస్పీ ఎస్. మధుసూదన్, భిక్కనూర్ సీఐ జె. నరేష్, సీసీఎస్ సీఐ బి. సంతోష్ కుమార్, భిక్కనూర్ ఎస్ఐ ఎస్. అనిల్, సీసీఎస్ ఎస్ఐ మహేష్, భిక్కనూర్ ఏఎస్ఐ వెంకట్రావు, ఏఎస్ఐ గంగారెడ్డి, ఐటీ కోర్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, భిక్కనూర్ కానిస్టేబుళ్లు బాలకృష్ణ, శ్రీకాంత్, కిషన్, గణేష్, రమేష్, శేఖర్, సీసీఎస్ కానిస్టేబుళ్లు లక్ష్మీకాంత్, చేతన్, స్వామి, రాజేందర్, మైసయ్య, మహేందర్‌లను జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, అభినందించారు.

# ఉత్తమ ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం

-- ఎంఈఓ కే. శ్రీనివాస్



**కామారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 11(ప్రజా జ్యోతి)** ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు రాష్ట్రస్థాయిలో జిల్లా స్థాయిలో మండల స్థాయిలో ఉత్తమ అవార్డులను అందించడం జరిగింది. ఈ సందర్భంగా శుక్రవారం రామారెడ్డి మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవం లో మండల ఉత్తమ 29 అధ్యాపకులకు అదేవిధంగా జిల్లాస్థాయిలో ఉత్తమ అవార్డు పొందిన 5 గురు అధ్యాపకులకు మండల విద్యాశాఖ అధికారి మరియు ఎంపీడీవో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు ఆధ్వర్యంలో వీరికి ఘనంగా సన్మానం చేయడం జరిగింది. వీరితోపాటు ఈ సంవత్సరం జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా సన్మానం పొందిన వారిని కూడా ఈ సందర్భంగా సన్మానించడం జరిగింది. కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు , మండల విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# వినాయక చవితికి విద్యుత్ భద్రతా ఏర్పాట్లు

**వైర్లు, విద్యుత్ స్తంభాల సరిచేత పనులు చేపట్టిన సిబ్బంది**

**గ్రామ ప్రజలు సహకరించాలి:**

**సర్పంచ్ ఆకుల శ్యాం కుమార్, ఉపసర్పంచ్ బచ్చగారి గోపాల్**

**కామారెడ్డి టౌన్ సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి)** కామారెడ్డి మండలం కోటల పల్లి గ్రామంలో వినాయక చవితి పండుగను పురస్కరించుకుని కొటాలపల్లి గ్రామంలో విద్యుత్ భద్రతకు సంబంధించి ముందస్తు చర్యలు చేపడుతున్నారు. పండుగ సందర్భంగా గ్రామంలో విద్యుత్ వైర్లు, కరెంట్ స్తంభాల కారణంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్ శాఖ సిబ్బంది ప్రత్యేకంగా మరమ్మతు పనులు నిర్వహిస్తున్నారు.



గ్రామంలోని అవసరమైన ప్రాంతాల్లో పెద్ద విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయడంతో పాటు, విద్యుత్ వైర్లను సరిచేసే పనులు చేపడుతున్నారు. వినాయక మండపాలు ఏర్పాటు చేసే ప్రాంతాల్లో విద్యుత్ వైర్లు, స్తంభాల వల్ల ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పండుగ సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఆకుల శ్యాం కుమార్, ఉపసర్పంచ్ బచ్చగారి గోపాల్ మాట్లాడుతూ.. వినాయక చవితి వేడుకలు ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించుకునేందుకు విద్యుత్ సిబ్బంది చేపడుతున్న పనులకు గ్రామ ప్రజలు పూర్తిగా సహకరించాలని కోరారు. మరమ్మతు పనులు జరుగుతున్న ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్ వైర్లు, స్తంభాలకు దూరంగా ఉండాలని సూచించారు.

పండుగ సమయంలో విద్యుత్‌కు సంబంధించిన సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా చర్యలు తీసుకుంటున్న విద్యుత్ సిబ్బందికి గ్రామ ప్రజలు సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు. గ్రామంలో వినాయక చవితి వేడుకలు ఎలాంటి అవాంతరాలు లేకుండా ఆనందోత్సాహాలతో జరుపుకునేలా అందరూ సహకరించాలని కోరారు.

# గర్గుల్‌లో ఘనంగా ఎడ్ల పొలాల అమావాస్య వేడుకలు

**ఎడ్లను శుభ్రంగా కడిగి ప్రత్యేక పూజలు..**

**గ్రామంలో పండుగ వాతావరణం**

**కామారెడ్డి టౌన్ సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి)** కామారెడ్డి మండలంలోని గర్గుల్ గ్రామంలో ఎడ్ల పొలాల అమావాస్య పర్వదినాన్ని గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా ఘనంగా నిర్వహించారు.



వ్యవసాయంలో రైతులకు అండగా నిలిచే ఎడ్లను ఈ పర్వదినం సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించి, వాటిని దేవుళ్లుగా భావిస్తూ పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా రైతులు, కుటుంబ సభ్యులు తమ ఎడ్లను శుభ్రంగా కడిగి, అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పసుపు, కుంకుమతో పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం సంప్రదాయ పద్ధతిలో గుడాలు, పోలీలు, పల్లి పిండి వంటకాలు తయారు చేసి పూజా కార్యక్రమాల్లో సమర్పించారు. ఎడ్లకు పూజలు నిర్వహించిన అనంతరం వాటిని గ్రామంలోని వివిధ గుళ్ల వద్దకు తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేయించారు. ఎడ్లను గుళ్ల వద్దకు తీసుకెళ్లి పూజలు నిర్వహించడం, వాటిని అందంగా అలంకరించి గ్రామంలో తిప్పడంతో గర్గుల్ గ్రామంలో ఎటు చూసినా పండుగ సందడి కనిపించింది. చిన్నారులు, మహిళలు, యువకులు, రైతు కుటుంబాలు ఉత్సాహంగా పాల్గొనడంతో గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొంది.

గ్రామీణ జీవన విధానంలో పశువులకు ఉన్న ప్రాధాన్యతను చాటిచెప్పే విధంగా ప్రతి సంవత్సరం ఎడ్ల పొలాల అమావాస్య వేడుకలను నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. పంట పొలాల్లో రైతులకు తోడుగా నిలిచే ఎడ్లను గౌరవించడం, వాటి ఆరోగ్యం, సంక్షేమం కోసం ప్రత్యేకంగా పూజలు చేయడం తమ పూర్వీకుల నుంచి వస్తున్న సంప్రదాయమని పేర్కొన్నారు. ఈ సంప్రదాయాన్ని భవిష్యత్ తరాలకు కూడా కొనసాగించాలని గ్రామ పెద్దలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మొగుళ్ల సాయిగౌడ్, రామగౌడ్ కుటుంబ సభ్యులు, సిబ్బంది పాల్గొని పూజా కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామంలోని పలువురు రైతులు, కుటుంబ సభ్యులు కూడా పాల్గొని ఎడ్ల పొలాల అమావాస్య వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s SAI KRISHNA PUBLICATIONS, Owned by M/s SAI KRISHNA PUBLICATIONS, Printed at – Sree Seshasai Enterprises, Plot No.98/1, Co-operative Industrial Estate, IDA Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri District, Telangana. Published at H.No.3-5-182, Kotagally, Ushaprasad Multiplex back side, Nizambad District-503001, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2010/35558 Phone No. 9440231967